## విలేకరులు కావలెను

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 289 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 12 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## భారత్‌లో మళ్లీ అంబానీదే హవా.. ప్రపంచ కుబేరుడిగా మస్క్ రికార్డు!

- 9,970 కోట్ల డాలర్ల సంపదతో ఆసియా నంబర్ వన్‌గా ముకేశ్ అంబానీ
- జాబితాలో 15 మంది తెలుగు కుబేరులు
- 83,900 కోట్ల డాలర్ల ఆస్తితో ప్రపంచ సంపన్నుడిగా మస్క్
- 3,910 కోట్ల డాలర్లతో సావిత్రి జిందాల్ రికార్డు
- దేశీ బిలియనీర్ల సంఖ్య 205 నుంచి 229కి చేరిక
- లక్ష కోట్ల డాలర్లకు చేరుకున్న భారత సంపన్నుల మొత్తం సంపద

ప్రముఖ అమెరికన్ బిజినెస్ మ్యాగజైన్ 'ఫోర్బ్స్' తన 40వ వార్షిక ప్రపంచ కుబేరుల జాబితాను విడుదల చేసింది. ఈ ఏడాది భారత్ నుంచి బిలియనీర్ల సంఖ్య భారీగా పెరగడం విశేషం. గతేడాది 205 మంది ఉండగా, ఈసారి ఆ సంఖ్య 229కి చేరింది. ఇందులో 30 మంది కొత్తగా ఈ క్లబ్‌లో చేరారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ

- మిగతా2లో



# వ్యవసాయానికి మరింత ప్రోత్సాహమిద్దాం

- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేద్దాం.
- ప్రజల ప్రాణాల పట్ల అలక్ష్యం వహించడం సరికాదు.
- అధికారుల ఫీల్డ్ విజిట్ల పై ప్రత్యేక పోర్టల్.
- ప్రభుత్వం పని చేసేది పేదల కోసం, సంపన్నుల కోసం కాదు.
- విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ విక్రయదారులుగా మారేలా ప్రణాళిక.
- ప్రభుత్వ పథకాల పై ప్రచారం చేపట్టాలి, ప్రజల్లో అవగాహన పెంచాలి.
- పంట కాల్వల పూడికతీత, చెరువుల లింకేజీకి 90 రోజుల యాక్షన్ ప్లాన్.
- జల్ జీవన్ మిషన్ గడువు పెంచడం శుభ పరిణామం.
- 6 వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు.



**అమరావతి, పెన్ సత్తా, మార్చి 11:** ఐటీ, క్వాంటం, ఏఐ వంటి రంగాల్లో కొత్త టెక్నాలజీలు, ల్యాబులు ఏర్పాటు చేస్తున్న తరహాలోనే, వ్యవసాయానికి మరింత ఊతమిచ్చేలా అలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ క్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలోనే, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేద్దామని సీఎం ప్రకటించారు. రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సమావేశం బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రారంభ మైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగానికి ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న కార్యక్రమాల పై ప్రజల్లో ప్రచారం కల్పించాలని,

- మిగతా2లో

## రాష్ట్రాన్ని చంద్రబాబు అప్పుల ఊబిలోకి నెట్టారు

- బడ్జెట్‌లో అన్నీ మోసపూరిత అంకెలే ఉన్నాయన్న జగన్
- తాము ఐదేళ్లలో చేసిన అప్పుల కంటే రెండేళ్లలో చంద్రబాబు ఎక్కువ చేశారని ఆరోపణ
- ట్రెజరీలో మినిమం బ్యాలెన్స్ కూడా ఉండటం లేదని విమర్శ



ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చిందని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బడ్జెట్ గణాంకాల నుంచి అవినీతి వరకు పలు అంశాలపై గణంకాలతో సహా విమర్శలు గుప్పించారు. పరిపాలనాదక్షుడిగా బిల్డప్ ఇస్తున్న చంద్రబాబు, వాస్తవానికి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నీ మోసపూరిత అంకెలే ఉన్నాయని జగన్ ఆరోపించారు. కాగ్ నివేదికను ఉదహరిస్తూ..

- మిగతా2లో



## స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాసం

### మూజువాణి ఓటుతో తిరస్కరించిన లోక్‌సభ

ఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం నిర్వహించిన ఓటింగులో మూజువాణి ఓటుతో సభ దీనిని తిరస్కరించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన కొన్ని వ్యాఖ్యలు వాతావరణాన్ని వేడెక్కించాయి. ఆయన క్షమాపణలు చెప్పాలంటూ విపక్షాలు డిమాండ్ చేశాయి. పెద్దఎత్తున నినాదాలుచేస్తూ సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించాయి.
ఈ పరిస్థితుల మధ్యనే ఓటింగు నిర్వహించి తీర్మానాన్ని తిరస్కరించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా

- మిగతా2లో

# హర్మూజ్‌లో అగ్గి

- ఇరాన్ మైన్ లేయింగ్ నౌకలపై అమెరికా తీవ్ర దాడులు
- ప్రతిగా 3 రవాణా షిప్‌లను ధ్వంసం చేసిన ఇరాన్
- వాటిలో భారత్‌కు వస్తున్న థాయ్ నౌక
- ముగ్గురు సిబ్బంది గల్లంతు
- ఒమన్ పోర్టులో చమురు ట్యాంకర్లపైనా దాడి
- ఇరాన్, లెబనాన్‌లపై కొనసాగిన ఇజ్రాయెల్ దాడులు
- గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు
- మళ్లీ పడిపోయిన స్టాక్ మార్కెట్లు

దుబాయ్: చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జల సంధిలో అగ్గిపుట్టింది. రవాణా నౌకలను పేల్చేందుకు ఇరాన్ మోహరించిన మైన్ లేయింగ్ నౌకలపై (సముద్రంలో మందుపాతరలు అమర్చే నౌకలు) అమెరికా భీకర దాడులు చేసింది. 16 నౌకలను ధ్వంసం చేసింది. ప్రతిగా పర్షియన్ గల్ఫ్ జలాల్లో 3 రవాణా నౌకలపై ఇరాన్

- మిగతా2లో





## నేను ఎప్పుడు అనుకుంటే అప్పుడే యుద్ధం ముగుస్తుంది

ఇరాన్‌పై యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అన్ని లక్ష్యాలను ఛేదించామని, ఇంకేమీ మిగల్లేదని అన్నారు. ఓ వార్తా సంస్థకు టెలిఫోన్ ఇంటర్వ్యూ ఇచ్చిన అధ్యక్షుడు ట్రంప్.. తాను ఎప్పుడు అనుకుంటే అప్పుడు యుద్ధం ముగుస్తుందన్నారు. "ఇరాన్‌లో భీకర యుద్ధం కొనసాగుతోంది. ఒకటి, రెండు మినహా.. అక్కడ పెద్దగా లక్ష్యాలేమి మిగల్లేదు. అమెరికా సేనలు ఊహించిన దానికన్నా ఎక్కువ విధ్వంసం సృష్టించాయి. మా ప్రణాళిక కన్నా చాలా ముందున్నాం. ఆరు వారాల్లో సృష్టిస్తామనుకున్న విధ్వంసాన్ని ముందుగానే చేశాం" అని ట్రంప్ పేర్కొన్నారు.

### గూగుల్ ఏఐ హబ్ మీద కోర్టుకెళ్లడం

## రాష్ట్రాభివృద్ధికి వ్యతిరేకం

**యువత, రాష్ట్ర భవిష్యత్తు మీద మీకెందుకు విద్వేషం?**

**జగన్‌పై మంత్రి నారా లోకేశ్ ధ్వజం**

విశాఖలో గూగుల్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఏఐ హబ్‌కు వ్యతిరేకంగా కోర్టుకెళ్లడం ద్వారా జగన్ మరోసారి తన అభివృద్ధి వ్యతిరేక రాజకీయాలకు తెరలేపారని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. విశాఖలో గూగుల్ సంస్థ పెట్టుబడులు దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ అని పేర్కొన్నారు. యువత, రాష్ట్ర భవిష్యత్తు మీద మీకెందుకు విద్వేషం? అంటూ జగన్‌ను నిలదీశారు. వైకాపా వాళ్లు ఎన్ని కుయుక్తులు

- మిగతా2లో





## డబ్బులు తీసుకుని నందిగం సురేష్ మోసం

- కాకినాడ సీబీసీఎన్‌సీ చర్చి ట్రస్టు రెన్యువల్ చేయిస్తానని రూ.25 లక్షల వసూలు
- విజయవాడలో జీరో ఎఫ్ఐఆర్..

అమరావతి : చర్చికి సంబంధించిన ట్రస్టును రెన్యువల్ చేయిస్తానని ఓ వ్యక్తిని నమ్మించి.. అడ్వాన్సుగా రూ.25 లక్షలు తీసుకున్నారు వైకాపా నేత, మాజీ ఎంపీ నందిగం సురేష్. పని చేయకుండా.. వసూలు చేసిన డబ్బు తిరిగి

- మిగతా7లో

## పశ్చిమాసియా యుద్ధ పర్యవసానాల్ని ఎదుర్కొంటాం

### తిరుచ్చి ఎన్డీయే సభలో ప్రధాని మోదీ



పశ్చిమాసియా యుద్ధ ప్రభావాల్ని గమనిస్తున్నామని, భారతీయుల ప్రయోజనాలకు అనుగుణంగానే ముందుకెళ్తామని ప్రధాని మోదీ తెలిపారు. తమిళనాడులోని తిరుచ్చిలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఎన్డీయే కూటమి బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. ఇదివరకు ఎలాంటి పరిస్థితి తలెత్తినా ప్రజల ఆకాంక్షలకే ప్రాధాన్యమిస్తూ వచ్చామని, ఇప్పుడూ అదే చేస్తామని స్పష్టత ఇచ్చారు. 2021లో తమిళనాడు ప్రజలు డీఎంకేకు అధికారమిచ్చారని, ఇందుకు బాధ్యత తీసుకోకుండా ప్రజల్ని వదిలేసి వారి కుటుంబానికే ప్రాధాన్యతనిస్తూ వెళ్తున్నారని ప్రధాని మోదీ ఆరోపించారు. రాష్ట్రాన్ని ఏటీఎంలా మార్చుకున్నారని ధ్వజమెత్తారు.

- మిగతా2లో

# జిల్లా కలెక్టర్ల సమావేశం ఏడు జిల్లాల సక్సెస్ స్టోరీలను ప్రజెంట్ చేసిన కలెక్టర్లు





**అమరావతి, పెన్ సత్తా, మార్చి 11:**ఏడు జిల్లాల నుంచి వచ్చిన సక్సెస్ స్టోరీలను ప్రజెంట్ చేసిన అనకాపల్లి, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, విజయనగరం, విశాఖ, కోనసీమ జిల్లాల కలెక్టర్లు. ఏడు జిల్లాల కలెక్టర్లను అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ నెట్ జీరో కాన్సెప్టులో భాగంగా అనకాపల్లి జిల్లాలో హాస్టళ్లు, పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు నిర్వహణ అద్భుతంగా ఉంది. కరవు నేల అన్నమయ్య జిల్లాలో జలసిరులు కురిపించేలా ఆ జిల్లా కలెక్టర్ వినూత్నంగా ఆలోచించారు. ఇలాంటి చొరవే మిగిలిన కలెక్టర్లూ తీసుకోవాలి.

వైజాగ్ 1 యాప్ ను ఆ విశాఖ కలెక్టర్ వినూత్నంగా రూపొందించారు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంది. ఆరోగ్యానికి సంబంధించిన వ్యక్తిగత డిజిటల్ రికార్డులను రూపొందించటంలో చిత్తూరు జిల్లా బాగా పని చేసింది. సంజీవని ప్రాజెక్టును అన్ని జిల్లాల్లోనూ సమర్ధంగా అమలు చేస్తే ఫలితాలు వస్తాయి. గల్ఫ్ వంటి దేశాలకు వెళ్లే వాళ్లని మోసాల బారిన పడకుండా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ఏర్పాటు చేసి ఆ జిల్లా కలెక్టర్ చొరవ తీసుకున్నారు. కోనసీమలో చేసిన ప్రయోగాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా జీఏడీ చర్యలు తీసుకోవాలి. గల్ఫ్ లాంటి ప్రాంతాలకు వెళ్లిన ప్రవాసాంధ్రులను రక్షించడానికి ఏపీఎన్ఆర్టీతో కలిసి పని చేయాలి. ఏజెంట్ల మోసాలతో ప్రవాసాంధ్రులు నష్టపోకూడదు. గ్రామ స్థాయి నుంచి భూ వివాదాలు పరిష్కరించేలా నెల్లూరు జిల్లాలో చేపట్టిన ప్రయోగం ఫలితాలు ఇస్తోంది. పీజీఆర్ఎస్ లో నమోదైన ఫిర్యాదులను వర్గీకరించి భూ వివాదాలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. భూ వివాదాలకు సంబంధించి నెల్లూరు జిల్లా అవలంభిస్తోన్న విధానాన్ని మిగిలిన జిల్లాల్లోనూ అమలు చేయాలి. గత పాలనలో ప్రైవేటు ల్యాండ్స్ ను 22 ఏలో పెట్టేశారు. ఇటీవల డోన్ వెళ్లినప్పుడు ఈ తరహా ఘటన నా దృష్టికి వచ్చింది.

రాష్ట్రంలో ఎక్కడా భూవివాదాలు లేకుండా చూడటమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటాం. కోర్టుల్లో సుదీర్ఘంగా కొనసాగుతున్న వివాదాలను మీడియేషన్ ద్వారా పరిష్కరించే ప్రయత్నం చేయాలి. వ్యవస్థీకృతంగా ఉన్న సవాళ్లను పరిష్కరించుకుంటూ ఉత్తరాంధ్ర హార్టికల్చర్ హబ్ గా విజయనగరం జిల్లాను మార్చటం అభినందనీయం. ఉత్తరాంధ్రకు చెందిన వారు చాలా ప్రాంతాలకు వలస వెళ్లారు. వారిలో అవగాహన పెంచేలా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ కు అభినందనలు. సంప్రదాయ పంటల నుంచి వాణిజ్య పంటల వైపుగా వారి సాగు విధానాలను మారిస్తే రైతులు సంపద సృష్టించగలుగుతారు. జిల్లాల్లో ఉన్న సమస్యల్ని సమస్యలుగా చూస్తే అలాగే ఉండిపోతాయి. సమస్యలను సవాళ్లుగా స్వీకరించి వినూత్నంగా ఆలోచన చేస్తే పరిష్కారం దొరుకుతుంది.

కొత్త ఆలోచనలు... ఆవిష్కరణల తోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

ప్రస్తుతం ఉన్న వనరుల్ని వినియోగించు కుంటూనే వివాదాలను వేగంగా సమర్ధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాల నుంచి వచ్చిన 7 సక్సెస్ స్టోరీలు మంచి ఫలితాలిస్తున్నాయి. వీటిని ఇతర జిల్లాల్లోనూ అమలు చేసేలా చర్యలు చేపడదాం. వచ్చే కలెక్టర్ల సదస్సుకు 28 జిల్లాల నుంచి 28 సక్సెస్ స్టోరీలు రావాలి అని చంద్రబాబు కలెక్టర్ లను కోరారు.

# నకిలీ నోట్ల చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 11:** నగరంలో నకిలీ నోట్ల చలామణి చేసేందుకు ప్రయత్నం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను గుట్టును మహారాణిపేట పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా మహారాణిపేట స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీపీ ఈస్ట్ కొండపల్లి లక్ష్మణ మూర్తి వెల్లడించారు. విశాఖ నగరాన్ని కేంద్రంగా చేసుకుని నకిలీ నోట్ల చలామణికి కుట్ర పన్నిన 10 మంది సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేయడం జరిగిందని, వీరంతా వివిధ జిల్లాలకు చెందిన వారని ఆయన తెలిపారు. మహారాణిపేట ఇన్స్పెక్టర్ జి. దివాకర్ యాదవ్ కి అందిన పక్కా సమాచారంతో సోమనాథ్ మెడికల్ షాప్ వద్ద వాహన తనిఖీలు చేపట్టామని ఏసీపీ పేర్కొన్నారు. జగదాంబ నుంచి కలెక్టర్ ఆఫీస్ వైపు వెళ్తున్న ఒక స్విఫ్ట్ కారును ఆపి తనిఖీ చేయగా, అందులో ముగ్గురు వ్యక్తులు నకిలీ కరెన్సీతో పట్టుబడ్డారని వెల్లడించారు. వారిని లోతుగా విచారించిన తరువాత, శరత్ థియేటర్ సమీపం లోని గీత ఇన్ లాడ్జిలో ఉన్న మరో ఏడుగురు ముఠా సభ్యులను కూడా అదుపు లోకి తీసుకున్నామని చెప్పారు. ?వీరి వద్ద నుండి దాదాపు రూ.37.70 లక్షల విలువైన నకిలీ నోట్లను, అలాగే రూ. 3,34,500 అసలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఒక కారు,12 మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు. నిందితుల పై బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించిన మహారాణిపేట ఇన్స్పెక్టర్, ఎస్సైలు, టాస్క్ ఫోర్స్ బృందాన్ని అభినందిస్తున్నట్లు కొండపల్లి లక్ష్మణమూర్తి వివరించారు.

# నన్ను ముస్లిం మైనార్టీలకు దూరం చేయలేరు.

- చిల్లర రాజకీయాలు మానుకోండి.
- ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు.
- ఇఫ్తార్ విందు సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.
- లక్ష్మీ నగర్ లో చేపలహరి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం.








**అనంతపురం, పెన్ సత్తా, మార్చి 11:** అర్బన్ నియోజకవర్గంలో తనను ముస్లిం మైనార్టీలకు ఎవరు దూరం చేయలేరని, కొందరు పనిలేని రాజకీయ నిరుద్యోగులు ఇలాంటివి చేస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. బుధవారం లక్ష్మీ నగర్ లో టిడిపి నేత చేపలహరి నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. లక్ష్మీ నగర్ కు వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు టిడిపి నాయకులు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరికి ఆయన రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ స్వయంగా భోజనం వడ్డించారు. ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన చేపలహరిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీలు అత్యధిక శాతం ఉన్నారన్నారు. 120 మసీదుల్లో రంజాన్ సందర్భంగా మౌళిక వసతులు కల్పించినట్లు చెప్పారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న అనంత వెంకటరామిరెడ్డి కానీ, మేయర్ వసీం కానీ ఏ రోజు మైనార్టీల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అసలు వారు ఐదేళ్లలో ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. ఈ 20 నెలల్లోనే ముస్లిం సోదరులు ఎంతో మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించినట్లు చెప్పారు. నగరంలో 130 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నానని అన్నారు. ఇవన్నీ జీర్ణించుకోలేని కొందరు రాజకీయ నిరుద్యోగులు నాపై కుట్రలు చేస్తున్నారన్నారు. ఒక మైనార్టీ నాయకుడు విషయంలో స్థానికంగా ఉన్న నేతలు గొడవపడితే, దానిని నాకు ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తనను మసీదుల్లోకి ఆహ్వానించ కూడదని ఎవరో ఒకరు చెప్పినంత మాత్రాన జరగదని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో జగన్ మోహన రెడ్డి రంజాన్ తోఫాను కూడా ఎత్తివేసి పేద మైనార్టీలకు పండుగ రోజు కూడా సరుకులు అందకుండా చేశారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థికంగా లోటు బడ్జెట్లో ఉన్నప్పటికీ ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

# 13 న గన్నవరం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన.

- అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులను విడుదల చేయనున్న సీఎం.
- సూరంపల్లిలో సభా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన యార్లగడ్డ.





**గన్నవరం, పెన్ సత్తా, మార్చి 11:**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 13 వ తేదీన శుక్రవారం కృష్ణా జిల్లా, గన్నవరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో అన్నదాత సుఖీభవ పథకం మూడో విడత నిధులను పీఎం, కిసాన్ నిధులతో కలిపి గన్నవరం మండలం సూరంపల్లి గ్రామం నుండి విడుదల చేయనున్నారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, జాయింట్ కలెక్టర్ నవీన్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్, ఎంఆర్ఓ శివయ్య ఇతర జిల్లా అధికారులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు సమన్వయంతో పని చేసి ఎటువంటి లోటు జరగకుండా చూడాలని సూచించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో సభకు వచ్చే వారికీ మంచినీరు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అస్సాం లోని గౌహతి లో ప్రధానమంత్రి కిసాన్ నిధులను విడుదల చేసిన అనంతరం, ముఖ్యమంత్రి చంద్రబాబు గన్నవరం మండలం సూరంపల్లి వేదికగా రాష్ట్రం లోని 46.80 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 2,808 కోట్లు నేరుగా జమ చేస్తారని తెలిపారు. రైతులకు కేంద్రం ఇచ్చే రూ. 2,000 లకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 4,000 కలిపి మొత్తం రూ. 6,000 లను ఈ విడతలో అందజేస్తోందని వివరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గన్నవరం వేదికగానే చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసారని అన్నారు. గతంలో కేంద్ర మంత్రి అమిత్ షా తో కలిసి చంద్రబాబు ఎన్డీఆర్ఎఫ్ భవన ప్రారంభోత్సవానికి ఇక్కడికే వచ్చారని యార్లగడ్డ గుర్తుచేశారు. ఇప్పుడు మూడో విడత నిధుల విడుదల కోసం మళ్ళీ సూరంపల్లి గ్రామానికి రావడం యాదృచ్ఛికమని, ఇది నియోజకవర్గ ప్రజల అదృష్టమని ఆయన పేర్కొన్నారు. గతంలో మొదటి విడత ప్రకాశం జిల్లా దర్శిలో, రెండో విడత కడప జిల్లా కమలాపురంలో జరగ్గా, ఇప్పుడు మూడో విడత కృష్ణా జిల్లా గన్నవరంలో జరగనుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ రైతుల సంక్షేమం కోసం భారీ నిధులు కేటాయించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలపడానికి రైతులందరూ భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ విజయవంతం కోసం నీటి సంఘాల అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, పాల కేంద్రాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలుకుతామని కార్యక్రమాన్ని దిగ్విజయం చేస్తామని స్పష్టం చేశారు.

## అనకాపల్లిలో జీరో వేస్ట్ రెసిడెన్షియల్ స్కూళ్లు.

- చెత్త ద్వారా సర్క్యులర్ ఎకానమీ కి
- కలెక్టరుకు సీఎం అభినందనలు.
- రాష్ట్రమంతటా ఈ పద్ధతి అమలు చేయాలని ఆదేశం.



**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 11:** జిల్లాలో ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లను జీరోవేస్ట్ స్కూళుగా మార్చుతున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా అధికారులు చేసిన వినూత్న ప్రయత్నం జిల్లా కలెక్టర్ల సదస్సు దృష్టిని ఆకర్షించింది. జిల్లాలో 114 సంస్థల్లో చెత్త, వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడంలో జిల్లా కలెక్టర్ వినూత్నంగా వ్యవహరించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేస్తూ అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఆ దిశగా ఈ విద్యా సంస్థల్లో ఉన్న చదువుతున్న విద్యార్థులు ఈ చెత్తను పొడి చెత్త, తడి చెత్త వేరు చేసి పారేసేలా వారిలో చైతన్యం కల్పించారు. తడి చెత్తను కంపోస్టుగా తయారు చేయడానికి ఆయా స్కూల పరిధిలో ప్రత్యేకంగా గుంత తవ్వి అందులో వేశారు. ఈ చెత్తను కంపోస్టుగా తయారు చేయడానికి ప్రత్యేకంగా గుంతలు తవ్వి వాటిని రైతులకు ఉపయోగపడే ఎరువుగా తయారు చేస్తున్నారు. హాస్టళ్ల నుంచి వృధాగా వెళ్లే నీరులో హానికరం కాని నీరు, హానికర నీరు అని రెండుగా విడదీసి, అవి బయటకు వెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పొడి చెత్తను రీసైక్లింగ్ కోసం ఆయా పరిధి లోని స్వర్ణ సచివాలయానికి అందజేశారు. మురికి నీరును మున్సిపల్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటుకు పంపేలా ఏర్పాటు చేశారు. 114 స్కూళ్లలో 24,775 మంది విద్యార్థులకు ఇది లబ్ది కలిగింది. ఈ సంస్థల నుంచి ప్రతి నెలా 57.1 టన్నుల తడి చెత్త, 24.5 టన్నుల పొడి చెత్త పోగవుతోంది. ఈ చెత్తద్వారా హాస్టళ్లకు ప్రతి నెలా రూ.2.17 లక్షల ఆదాయం సమకూరుతోందని అనకాప్లి జిల్లా కలెక్టరు వివరించారు. జీరో వేస్ట్ సంస్థలుగా జిల్లాలో రెసిడెన్షియల్ స్కూళ్లను మార్చుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ చేసిన ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ మోడల్‌ను అన్ని జిల్లాల కలెక్టర్లు అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఒక మంచి పేరు సూచించాలన్నారు. కేవలం ఇంతటితో ఆగకుండా అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో వారి అవసరాలకు సరిపడేలా కూరగాయలు పండించేలా తోటలు సాగు కూడా చేపట్టాలని. తద్వారా కూరగాయల అవసరాల్లో సమృద్ధి సాధించవచ్చన్నారు. ఈ దిశగా కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

## కంపెనీల హెచ్ ఆర్ లతో సమీక్ష నిర్వహించిన సుందరపు





**అచ్యుతాపురం, పెన్ సత్తా, మార్చి 11:**మండలంలో ఏపీఐఐసీ కార్యాలయంలో స్థానిక కంపెనీల హెచ్ ఆర్ లతో సమీక్ష నిర్వహించిన నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సుందరపు కంపెనీ హెచ్ ఆర్ లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పరిశ్రమలను స్థాపించడానికి తోడ్పాటు నందిస్తున్న తరుణంలో కంపెనీ వారు కూడా స్థానిక యువతకు తమ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. అలా స్థానికులకు ఉద్యోగాలు కల్పించినట్లైతే కంపెనీలలో ఏదైనా సమస్యలు ఉత్పన్నం అవవు అన్నారు. అదే విధంగా మీ కంపెనీలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడానికి ఏ అర్హతలు కావాలో, ఎలాంటి శిక్షణ మా యువతకు ఇప్పించాలో తెలియపరిస్తే తప్పకుండా వారికి ఆ శిక్షణనిచ్చి పంపిస్తామని విజయ్ కుమార్ అన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలు ఇచ్చి వారి జీవన అభివృద్ధికి సహకరించాలని సంస్థల సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పంచకర్ల, పీలా







**పెందుర్తి, పెన్ సత్తా, మార్చి 11:**నియోజకవర్గం జీవీఎంసీ 96 వ వార్డు లో 6.41కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు, నగర మేయర్ పీలా శ్రీనివాస రావు. బుధవారం పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 96 వ వార్డు పరిధి లోని పెందుర్తి లో పలు ప్రాంతాలలో 6.41 కోట్ల రూపాయల జీవీఎంసీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు.

ముందుగా వెంకటాద్రి పై వెలిసిన వెంకటేశ్వర స్వామి ని దర్శించుకుని, పూజలు చేసిన అనంతరం వెంకటాద్రి కొండ పైకి రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దొగ్గవానిపాలెం, కాలనీ, జనచైతన్య లేఅవుట్, ప్రసాద్ నగర్, గొర్లివాని కళ్లాలలో రోడ్లు కాలువలు తాగునీటి పథకాలకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ జీవీఎంసీ పాలకపగ్గాలు ఎన్డీఏ కూటమి చేపట్టిన తర్వాత అభివృద్ధి పరుగులు పెడుతోందని వెల్లడించారు. గత వైసిపి హయాంలో జరిగిన అభివృద్ధి కంటే ఎన్నో రెట్ల ఎక్కువ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియజేశారు. జీవీఎంసీ 96 వ వార్డులో బుధవారం ఒక్కరోజే 6.41 కోట తో పనులు ప్రారంభించామని తెలిపారు. ముఖ్యంగా సుదీర్ఘకాలంగా సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న గొర్లె వానికల్లాలకు తాగునీరు అందించడం ఎంతో సంతృప్తిగా ఉందని పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి వచ్చే జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పెందుర్తి జోన్ జోనల్ కమిషనర్ శంకర్రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దిలీప్ కుమార్, ఏ ఈ గొల్లవిల్లి శివ, పెందుర్తి పిఏసిఎస్ చైర్మన్ ఐతి సింహాచలం, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వర రావు, వార్డు అధ్యక్షులు డిబిఎల్ సంతోష్, పెంటకోట రాజేంద్ర ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రామానాయుడు, పెందుర్తి మాజీ ఏఎంసీ చైర్మన్ వేగి దివాకర్, 97 వ అధ్యక్షులు సేనాపతి సోమశేఖర్, వార్డు నాయకులు పీలా జితేంద్ర, కిల్లి రమేష్, గొర్ల అప్పారావు, అల్లా రమేష్, వానపల్లి నరసింగ రావు, నీటిపల్లి మహేష్, వానపల్లి సత్యనారాయణ, పిన్నింటి లక్ష్మణ్ నాయుడు, కొలిమిలా చల్ల మనాయుడు, బర్ల ఈశ్వర రావు, వరాహ నరసింహం, కాలనీ పెద్దలు, జీవీఎంసీ 96వ వార్డు ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏలూరు కలెక్టరేట్ ముందు కోకో రైతుల ధర్నా..








- ఉద్యాన శాఖ కార్యాలయం వరకు ర్యాలీ..
- కోకో గింజలు ధర తగ్గింపు పై కోకో కాయలతో నిరసన..
- కంపెనీలు, ప్రభుత్వ తీరు పై కోకో రైతుల ఆగ్రహం..
- కోకో గింజలకు ప్రైస్ పాలసీ, ప్రైస్ ఫార్ములా, ప్రైస్ నిర్ణయం వెంటనే ప్రకటించాలి.
- విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేయాలి..
- రైతులు వద్దనున్న కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలి..
- ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర నాయకులు డిమాండ్..


**ఏలూరు, పెన్ సత్తా, మార్చి 11:**ఆయిల్ పామ్ గెలలకు మాదిరిగా కోకో గింజలకు ప్రైస్ పాలసీ, ప్రైస్ ఫార్ములా, ప్రైస్ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ముందు కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కంపెనీలు ఇష్టారాజ్యంగా కోకో గింజల ధర తగ్గించివేయడం పట్ల కోకో రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీలు, ప్రభుత్వ తీరు పై కోకో కాయలతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు కలెక్టరేట్ నుండి ఉద్యాన శాఖ జిల్లా అధికారి కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు.

కోకో గింజలకు ధరల పాలసీ ప్రకటించాలని, విదేశీ కోకో గింజలు, కోకో ఉత్పత్తుల దిగుమతులు అరికట్టాలని, కోకో రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు.

ఈ ధర్నాకు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ ధర తగ్గిందని కోకో గింజల ధరను కంపెనీలు రోజు రోజుకి తగ్గించి వేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్ లో కిలో కోకో గింజలకు రూ.900లు రైతులకు చెల్లించలేదని, గత ఏడాది రూ.500 కోట్లకు పైగా కోకో రైతులు నష్టపోయారని గుర్తు చేశారు. ఈ ఏడాది జనవరిలో సీజన్ కిలో గింజలకు రూ.400 లకు ధర ప్రకటించి క్రమంగా ప్రస్తుతం రూ.300 లకు తగ్గించి వేశారని, ఇప్పుడు కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్ ధర కోసం మాట్లాడుతున్నాయని విమర్శించారు.

రాష్ట్రంలో సుమారు 80 వేల ఎకరాలలో కొబ్బరి, ఆయిల్ పామ్ అంతర పంటగా కోకో సాగు చేస్తూ ఎంతో కష్టపడి రైతులు కోకో గింజలు ఉత్పత్తి చేస్తున్నారని అన్నారు. మన దేశ అవసరాలలో 20 శాతం మాత్రమే ఇక్కడ కోకో గింజలు ఉత్పత్తి ఉందని, 80% దిగుమతి చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. 2024 సంవత్సరంలో అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కిలో కోకో గింజలకు అత్యధికంగా రూ.1040/- వరకు ధర పెరిగిందన్నారు. ఆ సంవత్సరం సరాసరి ధర రైతుకు కిలోకు రూ.750/- వరకు వచ్చిందన్నారు. ప్రస్తుతం కంపెనీలు సిండికేట్ గా మారి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని చెప్పారు. ఏలూరులో జరిగిన కోకో కాంక్లేవ్ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం ఆయిల్ పామ్ గెలల మాదిరిగా కోకో గింజలకు ప్రైస్ పాలసీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ళ వెంకట సుబ్బారావు, ఉప్పల కాశీ, పానుగంటి అచ్యుతరామయ్య, నాయకులు రుద్రరాజు సుబ్బరాజు, దేవరపల్లి సత్యనారాయణ, మోరంపూడి సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కర రావు, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ ఏడాది నుండి ధర పాలసీ ప్రకటించి ఫార్ములా రూపొందించి ధర నిర్ణయిస్తామని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వ హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రైస్ పాలసీ లేకపోవడంతో కంపెనీలు రైతులను మోసాలకు గురి చేసి నిలువునా దోచుకుంటున్నాయని విమర్శించారు. తక్కువ ధర ఇస్తున్నాయి. రైతుల నుండి సక్రమంగా కోకో గింజలు కంపెనీలు కొనుగోలు చేయడం లేదన్నారు. రైతుల వద్ద వందల టన్నుల కోకో గింజలు నిల్వ ఉన్నాయని, ఈ కోకో గింజలు కొనుగోలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రైస్ పాలసీ కమిటీలో కోకో రైతులకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని, కోకో రైతులు తమ అభిప్రాయాలను అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైస్ పాలసీ కమిటీ లోకి కోకో రైతులకు తగిన ప్రాతినిధ్యం అన్ని జిల్లాల నుండి కల్పించాలని కోరారు. కేంద్ర సిపిసిఆర్ఐ కోకో పరిశోధన కేంద్రాన్ని, కోకో బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కిలో కోకో గింజలకు రూ.500 ధర కల్పించాలన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, జిల్లా ఉద్యాన అధికారి షాజా నాయక్ లకు కోకో రేతులు డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు కె.సతీష్ బాబు, పి.పెదవీర్రాజు, ఎలిశెట్టి సోమరాజు, ఎన్.వి.సత్యనారాయణ, బి.బలరామకృష్ణం రాజు, డి.శ్రీనివాస్, మన్నే సాయిబాబు, కె.రామిరెడ్డి, వంకినేని లక్ష్మీనారాయణ, ఏలూరు జిల్లాతో పాటు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుండి వచ్చిన కోకో రైతులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన పంచకర్ల







**పెందుర్తి, పెన్ సత్తా, మార్చి 11:**7,63,520 లక్షల రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను ముగ్గురు బాధిత కుటుంబ సభ్యులకు అందజేసిన చేసిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ సంతృప్తినిచ్చే కార్యక్రమం అన్నారు. నియోజకవర్గం లోని సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధి పొందిన పేదలకు చెక్కుల పంపిణీ చేసే కార్యక్రమం తనకు వ్యక్తి గతంగా ఎంతో సంతృప్తినిచ్చేదని జనసేన విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పేర్కొన్నారు. ముగ్గురు లబ్ధిదారులకు 7 లక్షల 63 వేల 5 వందల 20 రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. పేదలకు సాయం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం తపన పడతారని అందులో భాగంగానే అర్హులైన పేదలందరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించడం అని పేర్కొన్నారు. ఉమ్మడి ఎన్ డి ఏ నాయకులు మీడియా మిత్రులు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.

సమాజంలో ఏ ఒక్క పేద కుటుంబానికి అన్యాయం జరగకూడదన్నది కూటమి ప్రభుత్వం లక్ష్యమని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని విరివిగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. నెలకు కనీసం రెండు సార్లు పేదలకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి క్యాంపు కార్యాలయానికి తీసుకొస్తే వారికి 15 రోజుల్లోనే తగిన ఆర్థిక సాయం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందే ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే రమేష్ బాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి పిఏసిఎస్ చైర్మన్ అయితే సింహాచలం, మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రామనాయుడు, సర్పంచ్ మామిడి శంకర్రావు, ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు, సారిపిల్లి విష్ణు, బర్రెడ్డి అప్పారావు, సేనాపతి సోమశేఖర్, గొర్ల అప్పారావు, ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసత్యాల విషజీవి జగన్ మంత్రి సుభాష్ ధ్వజం

**అమరావతి, పెన్ సత్తా, మార్చి 11:**మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అబద్ధాలు, మోసాలు తెలుసుకున్న ప్రజలు, వైసీపీని పాతాళంలో పాతరేసినా ఆయన తీరు లోమార్పు రావడం లేదంటూ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఏద్దేవా చేశారు. అబద్ధాలు, అసత్యాలతో కూటమి ప్రభుత్వం పై జగన్ రెడ్డి విషం కక్కుతున్నారని వాసంశెట్టి సుభాష్ మండి పడ్డారు.

గత అయిదేళ్ళ పాలనలో దోపిడీ చేసిన బాగోతాలు బయటపడడంతో సమాధానం చెప్పే దమ్ము లేని దద్దమ్మ జగన్ అంటూ ఘాటుగా విమర్శించారు.

కూటమి ప్రభుత్వంలో అప్పులు పెరిగిపోతున్నాయంటూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు జగన్ నానా యాగీ చేస్తున్నారని ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అప్పులు ఎలా, ఎందుకు, ఎవరి పాలనలో ఎంత పెరిగాయో ప్రజలకు నిజాలు తెలియవనుకోవడం జగన్ అవివేకానికి నిదర్శనమన్నారు. జగన్ రెడ్డి అయిదు సంవత్సరాల పాలనలో రాష్ట్ర అప్పులు ఏ స్థాయికి చేరాయో అందరికీ తెలుసని

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఆయన ఛిన్నాభిన్నం చేసిన ఉదంతం ఇంకా ప్రజలు మరచిపోలేదని వాసంశెట్టి సుభాష్ ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధిని పక్కన పెట్టి తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉచిత పథకాలు, ప్రచారం పేరుతో అప్పులు చేసి రాష్ట్రాన్ని దోపిడీ చేశారని ఆయన ఎద్దేవా చేశారు.

నేడు రాష్ట్ర అప్పులు పెరిగిపోతున్నాయని సిగ్గు లేకుండా సుద్దపూస మాటలు చెబుతున్నారంటూ జగన్ పై సుభాష్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తన పాలనలో చేసిన ఆర్థిక దోపిడీ మరుగున పడేలా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పై విషప్రచారం చేయడం సిగ్గు అనిపించడం లేదా? అని జగన్ రెడ్డి ని మంత్రి సుభాష్ ప్రశ్నించారు.

అప్పులు చెయ్యడం తప్పు కాదు. కానీ వాటిని దేని కోసం చేస్తున్నారన్నది ప్రజలందరూ గ్రహిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకునే అప్పులు పెట్టు బడులు రావడానికి, మౌలిక వసతులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనకు, ఆర్థిక వృద్ధికి అవసర మైన అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం కోసమేనన్న సంగతి ప్రజలందరికీ తెలిసినా ఏమి తెలియని రాజకీయ అజ్ఞాని జగన్ రెడ్డి అంటూ విమర్శించారు. జగన్ పాలన రాష్ట్రాన్ని అప్పుల భారంతో బలహీనపరిస్తే, కూటమి ప్రభుత్వం అప్పులను అభివృద్ధిగా మార్చే కృషి చేస్తోందని సుభాష్ తెలిపారు. పదకొండు మంది వైసీపీ ఎమ్మెల్యేల గురించి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్ కూడ జగన్ రెడ్డి సరిగా అర్థం కానట్టు ఉందని ఎద్దేవా చేశారు. పవన్ చేసింది పొగడ్త అనుకుని చంకలు బాదుకుంటున్న వైసీపి వాళ్ళను చూసే జాలివేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ప్రధాని అవుతారంటూ మీడియాలో వస్తున్న కథనాల పై జగన్ అక్కసు వెళ్ళగక్కడానికి మంత్రి సుభాష్ తీవ్రంగా ఆక్షేపించారు. జగన్ రాజకీయాల్లోకి రాకముందే దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన రాజకీయ దురంధరుడు చంద్రబాబు అన్నారు. ప్రధాన మంత్రి అవకాశాలు



వచ్చినగాని రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ పదవిని త్యజించిన వ్యక్తి చంద్రబాబు అనే సంగతి జగన్ కు తెలియకపోవడం శోచనీయమన్నారు. అసలు జగన్ సీఎంకు తక్కువ, ఎమ్మెల్యేకు ఎక్కువ అలాంటి వ్యక్తా చంద్రబాబు పై కామెంట్ చేసే హక్కు ఎక్కడదని సుభాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి కైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల పై వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు అయినా దక్కుతుందనే విషయాన్ని జగన్ గ్రహిస్తే మంచిదని సుభాష్ హితవు పలికారు.

# పెరిగిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి.







**ధర్మవరం, పెన్ సత్తా, మార్చి 11:**శ్రీ సత్య సాయి జిల్లా, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి కార్యాలయం నందు పెంచిన గ్యాస్ ధరల పై, కూటమి ప్రభుత్వం పై మాజీ ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు. కేతిరెడ్డి వెంకటరామి రెడ్డి సమావేశంలో మాట్లాడుతూ, పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదల పై గతంలో తమ పార్టీ చేసిన తప్పిదాన్ని మళ్లీ చేయకూడదని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలు పెంచినప్పుడు ఖండించకపోవడం తమ తప్పిదమని అంగీకరించిన ఆయన, ప్రస్తుతం పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజల పై అదనపు భారం మోపకుండా కూటమి ప్రభుత్వమే ఆ భారం భరించాలన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు మహిళల ఖాతాల్లో ఒక్క పైసా కూడా జమ కాలేదని ఆయన మండి పడ్డారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

- కూటమి ప్రభుత్వం పై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి మండిపాటు.
- మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ ఏమైంది?.
- కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేతిరెడ్డి.
- ప్రజల పై భారం మోపొద్దు గ్యాస్ ధరల పై కూటమి ప్రభుత్వానికి కేతిరెడ్డి డిమాండ్.
- రెండు సంవత్సరాలు గడిచినా హామీలు అమలు కాలేదు కేతిరెడ్డి విమర్శలు.
- గ్యాస్ ధరల పెంపు పై, కూటమి ప్రభుత్వం పై మాజీ ఎమ్మెల్యే ఫైర్

# ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోండి.








- గ్రామస్థాయి విద్య దేశ అభివృద్ధికి మొదటి మెట్టు.
- 10 తరగతి పరీక్షలు రాసే విద్యార్థినీ, విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ పంపిణీ.

**నంద్యాల, పెన్ సత్తా, మార్చి 11:**జిల్లా లోని, ప్యాపిలి మండలం, చిన్న పూజర్ల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోటివేషన్ గా డోన్ శ్రీ సుధా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ యోగానంద రెడ్డి పాల్గొని విద్యార్థులు పరీక్షల సమయంలో ఏ విధంగా చదవాలి, ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి, పరీక్ష హాల్లో ఎలా రాయాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామచంద్ర రెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, చిట్టి రెడ్డి, ఉపాధ్యాయులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు అక్రమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు గ్రామీణ స్థాయి విద్యార్థుల నుంచి మొదలవుతుందని, కావున విద్యార్థులు భయాన్ని వదిలి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలని వారు విద్యార్థులను కోరారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని వారి తల్లిదండ్రులు కలలు కన్న జీవితాన్ని, విద్యార్థులు సాధించి మన గ్రామాన్ని జిల్లాలో మొదటి స్థానానికి తీసుకొని రావాలని వారు పిలుపునిచ్చారు. విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన సామాగ్రి ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు.

# టెన్త్ క్లాస్ పిల్లలకు ఎగ్జామ్ పేడ్స్ పంపిణీ చేసిన తుమ్మలపల్లి రమేష్

**కాకినాడ, పెన్ సత్తా, మార్చి 11:**జగ్గంపేట నియోజకవర్గం, కిర్లంపూడి మండలం, తామరాడ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ క్లాస్ పరీక్షలు రాయబోయే విద్యార్థిని, విద్యార్థు లకు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఎగ్జామ్ పేడ్స్ పంపిణీ చేశారు. హై స్కూల్ చైర్మన్ ఎలుగుబండి శ్రీను, జనసేన పార్టీ నాయకులు కాయల మణికంఠ, పాలెం బాబీ, కాయల శ్రీను, దానధర్మ ట్రస్ట్ నిధులతో పిల్లలకు ఎగ్జామ్ పాడ్స్ ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరై విద్యార్థినీ, విద్యార్థులందరికీ ఎగ్జామ్ పాడ్స్ పంపిణీ చేసి పిల్లలు అందరికీ అల్ ది బెస్ట్ తెలియచేసారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతు భవిష్యత్తు కు 10 వ తరగతి తొలి మెట్టు అని, తామరాడ హై స్కూల్ లో చదువుకున్న చాలా మంది విద్యార్థులు ఇప్పుడు ఉన్నత స్థాయి లో ఉన్నారు అని, ఇక్కడ ఫాకల్టీ మంచి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు అని కాబట్టి అందరూ ఎగ్జామ్స్ బాగా రాసి, మన తామరాడ హై స్కూల్ కు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అలాగే ఈ ఎగ్జామ్ పాడ్స్ కి నిధులు అందచేసిన హై స్కూల్ చైర్మన్ ఎలుగుబండి శ్రీను కి, జనసేన నాయకులు కాయల మణికంఠ, పాలెం బాబీ, కాయల శ్రీను, దానధర్మ ట్రస్ట్ శివ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ గోకేడ రాజా, ప్రధానోపాధ్యాయులు కృష్ణ, కిర్లంపూడి మండలం ఉపాధ్యక్షులు సత్యంశెట్టి గణేష్, దాన ధర్మ ట్రస్ట్ అప్పికొండ శివ, తుంగపల్లి గోవింద్, స్టాఫ్ సెక్రెటరీ నూకరాజు మాస్టారు, కాయల వినయ్, తదితరులు పాల్గొన్నారు.







# నెలాఖరుకు బృహత్ ప్రణాళిక ప్రాధాన్యత రహదారులను పూర్తి చేయాలి.



**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 11:**ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మే నెలాఖరుకు బృహత్ ప్రణాళిక ప్రాధాన్యత రహదారులను పూర్తి చేయాలి, వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్. వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ లు సంయుక్తంగా బుధవారం నిర్వహించిన సాంకేతిక విభాగపు సమీక్ష సమావేశంలో జోన్ల వారీగా పనుల ప్రగతిని సమీక్షించారు. తదుపరి చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కార్యకలాపాలను ప్రారంభించేనాటికి, భోగాపురం ఎయిర్ పోర్టు కు అనుసంధానించే బృహత్ ప్రణాళిక ప్రాధాన్యత రహదార్లను మే నెలాఖరు నాటికి పూర్తి చేస్తామన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు కు నగరం నుంచి ఎటువంటి అవరోధములు లేకుండా సమయానికి చేరుకోవడమే రహదారుల విస్తరణ ప్రధాన ఉద్దేశమని, ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ రహదారులు నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం కూడా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వి.ఎం.ఆర్.డి.ఏ పరిధి లోని అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో కూడా రహదారుల, పార్కుల నిర్మాణనికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ సంస్థ చేపట్టిన 7 ప్రాధాన్యత రహదారుల విస్తరణ పనులు ప్రస్తుతం సుమారు 60 శాతం వరకు పూర్తి అయ్యాయని, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా, అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో నిర్దిష్ట కాలపరిమితి లోగా ప్రాధాన్యత రహదార్ల పనులన్నీ ఎట్టి పరిస్థితుల్లో శత శాతం పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. అలాగే ప్రారంభించవలసిన కొత్త పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలకు తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదన రావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి కాంప్లెక్స్ ను తనిఖీ చేసిన సుందరపు








**యలమంచిలి, పెన్ సత్తా, మార్చి 11:**నియోజకవర్గ కేంద్ర మైన యలమంచిలి పట్టణ ఆర్టీసి కాంప్లెక్స్ ను తనిఖీ చేసిన నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరవాడ నుంచి నక్కపల్లి వరకూ ఒక జోన్ గా ఉన్న నేపథ్యంలో ఎస్.రాయవరం, రాంబిల్లి తదితర ప్రాంతాల ప్రజలకు ప్రయాణార్థం యలమంచిలి ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రధానమైనది కనుక భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కాంప్లెక్స్ కు అత్యాధునికంగా అభివృద్ధి చేయాల్సిన అవసరముందన్నారు. అలాగే ఇప్పటికే సుదూర ప్రాంతాలకు వెళ్లే సర్వీస్ బస్సులు యలమంచిలి కాంప్లెక్స్ లోకి వస్తున్నందున, వొల్వో బస్సులు కూడా వచ్చే విధంగా కాంప్లెక్స్ ని తీర్చిదిద్దుతామన్నారు. అలాగే కాంప్లెక్స్ లో నిర్వహిస్తున్న దుకాణాలలో తిను బండారాలను పరిశీలించారు. అదే విధంగా మరుగుదొడ్లను కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్య పరి రక్షణ కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుంది.

- కిశోర బాలికలందరూ హెచ్పీవీ వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్ ను వినియోగించు కోవాలి.
- పిహెచ్సీ వద్ద వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు.





**కొత్తపేట, పెన్ సత్తా, మార్చి 11:**ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో మహిళల సంరక్షణ కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. బుధవారం ఊబలంక పిహెచ్సి పరిధిలో కిషోర్ బాలికల కోసం ప్రభుత్వం అందిస్తున్న హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పీహెచ్సీ పరిసరాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న క్యాన్సర్ వంటి మహమ్మారులను ఎదుర్కోవడం కోసం ముందస్తు చర్యల్లో భాగంగా 14 సం.ల వయస్సు నుంచి 15 సం.ల వయస్సు ఉన్న కిశోర బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ వేయడం ద్వారా వారు గర్భాశయ క్యాన్సర్ తోపాటు అనేక క్యాన్సర్ లకు గురి కాకుండా ఉండాలనే ఆలోచనతో బృహత్తర మైన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కొనియాడారు. కిశోర బాలికలు అందరికీ ఉచితంగా వ్యాక్సిన్ అందించడం గొప్ప విషయమన్నారు. బయట మార్కెట్లో ఈ వ్యాక్సిన్ ఖరీదు రూ.4 వేల వరకూ ఉంటుందని, మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం
మొదలు పెట్టిన ఈ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వినియోగించు కోవాలన్నారు. అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషించే మహిళల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రధాన మైన అంశంగా భావించి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనే మహమ్మారిని రూపుమాపాలనే లక్ష్యంతో హెచ్ పి వి ఇంజక్షన్లు స్పెషల్ డ్రైవ్ ద్వారా అందిస్తున్నారన్నారు. ఊబలంక పీహెచ్సీ పరిధిలోనే 350 మందిని గుర్తించి వ్యాక్సిన్ అందించడం జరుగుతుందన్నారు. మహిళలంతా కూడా మరీ ముఖ్యంగా 14 నుంచి 15 వయసు ఉన్న కిశోర బాలికలు తప్పకుండా ఈ వ్యాక్సిన్ వేయించు కోవాలని పిలుపునిచ్చారు. మహిళల ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు.

## చంద్రన్న ప్రమాద బీమా చెక్కులుఅందజేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**గుంతకల్లు, పెన్ సత్తా, మార్చి 11:**పి.వి శివకుమార్ తనయుడు పి.వి జగదీష్ కు చంద్రన్న ప్రమాద బీమా చెక్కు ఐదు లక్షల రూపాయలులి పామిడి టిడిపి నాయకులు సమక్షంలో అందించడం జరిగింది . ఈ సందర్భంగా పీ.వీ శివ కుమార్ తనయుడు జగదీష్ మాట్లాడుతూ తన తండ్రి ప్రమాదవశాత్తు మరణించిన కారణంగా నాకు మరియు నా కుటుంబానికి టిడిపి పార్టీ మరియు గుమ్మనూరు జయరాం మరియు గుమ్మనూరు ఈశ్వర్ చాలా అండగా నిలబడ్డారు అని వారి మేలు జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను అని ఈ సందర్భంగాతెలియజేశారు.అలాగే ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరైనా వంద రూపాయలు కట్టి టిడిపి సభ్యత్వం తీసుకున్న యెడల వారి కుటుంబానికి ఏదైనా అనుకోని ఆపద జరిగిన టిడిపి పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ మరియు మండల కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరవాడ కి మరో కాలుష్యం కుంపటి పెట్టొద్దు.



సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి డిమాండ్.

**పరవాడ, పెన్ సత్తా, మార్చి 11:** మండల కేంద్ర మైన పరవాడ కి ఆనుకొని ఏపీఐఐసీ ఫేస్ 2 పరిశ్రమల నిర్మించడానికి సన్నహాలు చర్యలు చేపట్టింది. పరిశ్రమలకి సేకరించిన భూములను సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గనిశెట్టి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఏపీఐఐసీ ఫేజ్ 2 విస్తరణ పనుల్లో రైతులు తమ విలువైన భూములను కోల్పోయారని అయితే మరోసారి గ్రామం మరో కాలుష్య కుంపటికి గురి కాబోతుందని అన్నారు. ఏపీఐఐసీ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిశ్రమ నిర్మాణ పనులను నిలుపుదల చేసి గ్రీన్ బెల్ట్ బఫర్ జోన్ 500 మీటర్లు గ్రామాన్ని ఆనుకొని ఏర్పాటు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. దీనితో పాటుగా గ్రామ రైతులు జిరాయితి భూములను గ్రీన్ బెల్ట్ గా చూపించడం అన్యాయమన్నారు. దీనివల్ల రైతులు జిరాయితి భూములు అమ్ముకోవడానికి గాని ఇల్లులు కట్టు కోవడానికి గాని అవకాశం లేకుండా పోతుందని అన్నారు. పరవాడ గ్రామాన్ని ఆనుకొని పరిశ్రమలు నిర్మాణాలు చేస్తే కాలుష్యం మరింత పెరిగి గ్రామంలో జబ్బులు మరిన్ని పెరిగిపోతాయి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఫార్మా పరిశ్రమల వలన తీవ్రమైన కాలుష్యంతో గుండె జబ్బులు, కిడ్నీ, క్యాన్సర్ లాంటి జబ్బులతో అల్లాడుతున్నారని దీనికి తోడు మరో కాలుష్య కుంపటి పెట్టడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇప్పటి కైనా పునరాలోచన చేసి గ్రామాన్ని ఆనుకొని పరిశ్రమలకు మధ్యలో గ్రీన్ బెల్ట్ బఫర్ జోన్ ఏర్పాటు చేసి పరవాడలో గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజల ఆమోదం మేరకే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో రైతుల కుటుంబాలకు, స్థానికులకు 75 శాతం ఉపాధికి అగ్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలుష్య కారక పరిశ్రమలు నిర్మించమని అగ్రిమెంట్ లో పేర్కొనాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పైడితల్లి, సర్వేశ్వరరావు, ఏరుకు నాయుడు, సిహెచ్ అప్పారావు, అప్పల నాయుడు, సంతోష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముద్దిరెడ్డి పల్లిలో రోడ్డు పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**హిందూపురం,పెన్ సత్తా, మార్చి 11:** పట్టణంలోని 36వ వార్డు ముద్దిరెడ్డి పల్లి ఏరియా నందు జరుగుతున్న క్రొత్త రోడ్డు పనులను నేడు మునిసిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ హిందూపురం అభివృద్ధి కోసం ఇటీవల విడుదలైన 92.50 కోట్ల రూపాయలలో క్రొత్త రోడ్లు కాలువలు నిర్మాణం చేపడుతున్నామని, ఎన్నో సంవత్సరాల నుండి వార్డులలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఇక నుండి తొలగిపోతాయని, మన బాలయ్య గారు హిందూపురం యొక్క రూపురేఖలు మార్చి, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాడని, రాష్ట్రంలోనే హిందూపురం అభివృద్ధిలో ముందంజు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భారతి, టీడీపీ నాయకులు హరీష్ కుమార్, ఉప్పర చంద్ర మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ గా హాజీ మహమ్మద్



**యాడికి పెన్ సత్తా, మార్చి 11:** :యాడికి మండల కేంద్రంలోని బుధవారం తాడిపత్రి ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నేషనల్ ప్రెసిడెంట్ హాజీ మహమ్మద్ ముజాహిద్, నేషనల్ చైర్మన్ షోయబ్ లు యాడికి మండల కేంద్రానికి చెందిన షేక్ షేక్షావలిను ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ తాడిపత్రి నియోజకవర్గ అధ్యక్షుడిగా బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా షేక్ షేక్షావలి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నాకు తాడిపత్రి నియోజకవర్గ అధ్యక్షునిగా పదవి ఇచ్చినందుకు ఎల్లప్పుడూ తాడిపత్రి నియోజకవర్గ ప్రజలు ,మండలాల ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని కచ్చితంగా వారి సమస్యలు పరిష్కరించే విధంగా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని షేక్షావలి తెలిపారు.

## నన్ను ముస్లిం మైనార్టీలతో దూరం చేయలేరు

- చిల్లర రాజకీయాలు మానుకోండి
- ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు
- ఇఫ్తార్ విందు సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- లక్ష్మీ నగర్ లో చేపలహరి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం



**అనంతపురం,పెన్ సత్తా, మార్చి 11:** :అర్బన్ నియోజకవర్గంలో తనను ముస్లిం మైనార్టీలకు ఎవరు దూరం చేయలేరని కొందరు పనిలేని రాజకీయ నిరుద్యోగులు ఇలాంటివి చేస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. లక్ష్మీ నగర్ లో టిడిపి నేత చేపలహరి నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. లక్ష్మీ నగర్ కు వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు టిడిపి నాయకులు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరికి ఆయన రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ స్వయంగా భోజనం వడ్డించారు. ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన చేపలహరిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గంలో మైనార్టీలు అత్యధిక శాతం ఉన్నారన్నారు. 120 మసీదుల్లో రంజాన్ సందర్భంగా మౌళిక వసతులు కల్పించినట్లు చెప్పారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న అనంత వెంకటరామిరెడ్డి కానీ, మేయర్ వసీం కానీ ఏ రోజు మైనార్టీల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అసలు వారు ఐదేళ్లలో ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. ఈ 20 నెలల్లోనే ముస్లిం సోదరులు ఎంతోమందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించినట్లు చెప్పారు. నగరంలో 130కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నానని అన్నారు. ఇవన్నీ జీర్ణించుకోలేని కొందరు రాజకీయ నిరుద్యోగులు నాపై కుట్రలు చేస్తున్నారన్నారు. ఒక మైనార్టీ నాయకుడు విషయంలో స్థానికంగా ఉన్న నేతలు గొడవపడితే.. దానిని నాకు ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తనను మసీదుల్లోకి ఆహ్వానించకూడదని ఎవరో ఒకరు చెప్పినంత మాత్రాన జరగదని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో జగన్మోహన్ రెడ్డి రంజాన్ తోఫాను కూడా ఎత్తివేసి పేద మైనార్టీలకు పండుగ రోజు కూడా సరుకులు అందకుండా చేశారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థికంగా లోటు బడ్జెట్లో ఉన్నప్పటికీ ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## గుత్తి పట్టణంలో అట్టహాసంగా అహుడా చైర్మన్ టీసీ వరుణ్ జన్మదిన వేడుకలు

- ఆర్టీసీ బస్టాండ్ లో పేదలకు వాసగిరి మణికంఠ మరియు గుత్తి, పట్టణ మండల జనసేన నాయకుల ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ
- అనంత జిల్లాలో పవన్ కళ్యాణ్ ఆశయ సాధకుడిగా టిసి వరుణ్ ను అభివర్ణించిన జనసేన శ్రేణులు

**గుంతకల్లు, పెన్ సత్తా, మార్చి 11:** :జనసేనాని, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ సేవ స్ఫూర్తితో జనహృదయనేత, అనంత జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ జన్మదినం సందర్భంగా గుంతకల్ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త శ్రీ వాసగిరి మణికంఠ గారి ఆధ్వర్యంలో జనసేన శ్రేణుల సమక్షంలో గుత్తి పట్టణం ఆర్టీసీ బస్టాండ్ నందు నందు ఉదయం పేదలకు అల్పాహారం పంపిణీ మరియు చెరువు కట్ట శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయం నందు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ వాసగిరి మణికంఠ గారు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ ఎదుగుదలకు శక్తి వంచన లేకుండా కృషి చేసినటువంటి వ్యక్తి, సేవాతత్పరుడు టీసీ వరుణ గారి జన్మదినాన్ని పురస్కరించుకొని వేడుకలకు దూరంగా, బాధ్యతలకు దగ్గరగా జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల సేవా కార్యక్రమాలు జనసేన శ్రేణులు చేస్తున్నారని, ఆ భగవంతుడి దయతో వరుణ్ గారు భవిష్యత్తులో అత్యున్నత ఉన్నత పదవులు అవరోదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి మండల, పట్టణ అధ్యక్షులు పోతురాజుల చిన్న వెంకటేశులు, పాటిల్ సురేష్ జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడు పవర్ శేఖర్ పట్టణ ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు వెంకటపతి నాయుడు మండల ప్రధాన కార్యదర్శులు గోరంట్ల నాగయ్య, శ్రీ మిద్దె ఓబులేష్ మండల ప్రధాన కార్యదర్శి చంద్ర, వెంకటేష్, జింక హేమంత్, మురళి నాయక్, ధనంజయ, హసేన్ భాష, గోపాల్, శ్రీ నాగరాజు, జయరాజ్, రవికుమార్, ధోని ముక్కల విజయ్ కుమార్, శ్రీ హాజీ, శ్రీ బాషా తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ భద్రకాళి దేవస్థాన పంచాంగం ఆవిష్కరణ

**పెన్ సత్తా, మార్చి 11:** స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థాన పంచాంగాన్ని ఈ రోజు అనగా దివి 11-03-2026 బుధవారం రోజున దేవస్థాన కార్యాలయంలో వరంగల్ జోన్ డిప్యూటీ కమీషనర్ మరియు శ్రీ భద్రకాళి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీమతి రామల సునీత చేతుల మీదుగా ఆలయ ధర్మకర్తలు శ్రీ తొనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణచందర్, మోతుకూరి మయూరి రామేశ్వర్రావు, ఎక్స్-అఫీషియో ధర్మకర్త శ్రీ పార్శంది నర్సింహమూర్తి ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు, ముఖ్య అర్చకులు శ్రీ చెప్పల వెంకట నాగరాజ శర్మ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణా జ్యోతిష పండితులలో వరంగల్ బ్రదర్స్ పేరుగాంచిన బ్రహ్మశ్రీ అయినవోలు రాధాకృష్ణ సిద్ధాంతి, శాయికృష్ణ సిద్ధాంతి సోదరులచే గుణించబడిన తిథివార నక్షత్రయోగకరణములతో కూడిన ఈ పంచాంగాన్ని తేది: 13-07-2025 రోజున హైదరాబాదులోని శ్రీ పుష్పగిరి పీఠంలో జరుపబడిన తెలంగాణా విద్వత్ సభ సమావేశంలో సూర్య సిద్ధాంత రీత్యా (పూర్వ సిద్ధాంత రీత్యా) నశాస్త్రీయమైనదిగా తెలంగాణా జ్యోతిష పండితుల ఆమోదాన్ని పొందడం వరంగల్ నగరానికి గర్వకారణమని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. పంచాంగములో సూచింపబడిన శుభ ముహూర్తములు గోచార, గ్రహచారములు. ఈ పరాభవ నామ సంవత్సరంనందు దేశ రాష్ట్ర ఫలితములు, వర్ష సూచనలు మరియు పండుగల తిథి నిర్ణయము ధర్మశాస్త్రబద్ధముగా జరిపిన సిద్ధాంతులు శ్రీ అయినవోలు రాధాకృష్ణ కాయికృష్ణ శర్మల కృషి అభినందనీయమైనదని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం సిద్ధాంతి సోదరులను ఆలయ ధర్మకర్తలు సత్కరించారు.పంచాంగ శ్రవణం తేది: 19-03-2026 గురువారం ఉగాది రోజున సాయంకాలం గం। 07-00లకు బ్రహ్మశ్రీ అయినవోలు రాధాకృష్ణ సిద్ధాంతి వరంగల్ శ్రీ భద్రకాళి దేవాలయంలో జరుపుతారని అందరూ విచ్చేయవలసినదిగా ఆలయ ధర్మకర్తలు కోరారు

## నూకాంబిక హుండి లెక్కింపు



**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 11:** నూకాంబిక అమ్మవారి దేవస్థానము మండపములో హుండీ లెక్కింపు జరిగినది. బుధవారం అమ్మవారికి భక్తులు హుండి ద్వారా 8-01-2026 ది నుండి 11/03/2026 వరకు మొత్తం 62 రోజులలో సమర్పించిన ముడుపులు, మొక్కుబడులను లెక్కింపులో నగదుగా రూ 27,11,713 /- లు, బంగారం 11 గ్రాములు, వెండి 550 గ్రాములు వచ్చినది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యళ్ళశ్రీధర్, జిల్లా సహాయ కమిషనర్ కేఎల్ సుధారాణి, దేవాదాశాఖ ఇన్స్పెక్టర్ వసంత కుమార్, ఆలయ ధర్మకర్తలు
సూరే సతీష్, దాడి రవికుమార్
పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు,కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడ్రాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, హుండీల లెక్కింపునకు దేవస్థానము సిబ్బంది, పూజారులు, శ్రీవారిసేవ సభ్యులతోను, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది, అనకాపల్లి టౌన్ పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.ద

## అమ్మవారికి సారె సమర్పణ





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 11:**ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో బుధవారం వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల కమిటీ ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారికి మహిళలు పసుపు కుంకాలు, వివిధ రకాల పిండి వంటలు తయారుచేసి ఊరేగింపుగా ఆలయాలు చేరుకొని అమ్మవారి సారె సమర్పించారు. ఆలయ అధ్యక్షులు గరికి వెంకట్రావు సెక్రటరీ నానేపల్లి రవి, కోశాధికారి పోతల రమణ, వీరి పెద్దలు వీరిని దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్ ఘనంగా సత్కరించారు.
ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు ,మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులతో పంటల దిగుబడి పెంచుకోవాలని సూచన

తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు



**చింతకాని పెన్ సత్తా, మార్చి 11**చింతకాని మండలం పరిధిలో జగన్నాథపురం రైతు వేదికలో ఆత్మ కమిటీ వారి ఆధ్వర్యంలో ఆత్మ కమిటీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ బుధవారం ఏర్పాటు చేయడం జరిగింది. రైతు శిక్షణ కార్యక్రమంలో తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు మాట్లాడుతూ వివిధ పంటలలో , రైతులు ఆధునిక, శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా పంటల దిగుబడిని గణనీయంగా పెంచుకోవచ్చని తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు సూచించారు. ఈ సమావేశం ద్వారా రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల నిర్వహణ, ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, మరియు నూతన సాంకేతికతలపై సమగ్ర సమాచారాన్ని గ్రామస్థాయిలో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి రైతులు సాగు చేస్తున్న పంటలపై రైతులకు ఇన్సూరెన్స్ కల్పించాలి రైతులంతా మొక్కజొన్న పంట పై సాగు చేస్తున్నారు ఈ అకాల వర్షం గా దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి ప్రస్తుతం రాబోయే రోజుల్లో వ్యవసాయం చేయాలంటేనే రైతులు అప్పు చేసి గిట్టుబాటు ధరలు రాక భయాందోళన గురై రైతులు పురుగులు మందు తాగి చాలామంది మరణిస్తున్నారు దీనివలన పండించే రైతులు తక్కువయ్యారు రైతులు నష్టాలు బయటపడటానికి సమగ్ర బీమా, ఆధునిక సాగు పద్ధతులు మరియు మార్కెటింగ్ పరిజ్ఞానం చాలా అవసరమని తెలియజేశారు కలుపు మందుల వాడకం పంటలపై సానుకూల మరియు ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. సకాలంలో, సరైన మోతాదులో వాడితే కలుపు నియంత్రణ ద్వారా దిగుబడి (50% వరకు) పెరుగుతుంది. అయితే, అధిక మోతాదు లేదా తప్పుడు మందుల వాడకం వల్ల ప్రధాన పంట పెరుగుదల నిలిచిపోవడం, ఆకులు ఎల్లోయింగ్ (పసుపు రంగులోకి మారడం), మరియు చివరికి పంట దెబ్బతినడం మనుషుల ఆరోగ్యం వంటి నష్టాలు జరుగుతాయి. కాబట్టి కలువు మందులు వాడదలచుకున్నప్పుడు నిపుణుల సలహాలుగాని, సమీపంలోని వ్యవసాయాధికారిని గాని సంప్రదించటం మంచిది అని తెలియజేశారు.

పెన్ సత్తా

## ఎడిటోరియల్

## మూత్రపిండాల పట్ల అవగాహన పెంచుకోలేమా!

ప్రతి ఏటా మార్చి 2వ గురువారం ప్రపంచవ్యాప్తంగా "ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవం (వరల్డ్ కిడ్ని డే)" జరుపుకుంటూ కిడ్నీల ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన పెంచుకోవడం, ప్రచారం నిర్వహించడం నిరంతరం జరగాలి. ప్రపంచవ్యాప్తంగా 10 శాతం వరకు పెద్దలు ఏదో ఒక రకమైన మూత్రపిండాల సమస్యలతో బాధ పడుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మూత్రపిండ సమస్యలు ముదిరితే లక్షలాది రోగులు అకాలమరణం బారిన పడుతున్నారు. మూత్ర పిండాల సమస్యలను నిరోధించడానికి ముందస్తుగా పరీక్షలు చేయించుకొని తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రాణాలు దక్కుతాయని గమనించాలి. మూత్ర పిండ సమస్యలు నిశ్శబ్దంగా తీవ్రరూపం దాల్చుతుంటాయి. ముత్ర పిండాలు రక్తం నుండి వ్యర్థాలను, అదనపు ద్రవాలను ఫిల్టర్ చేస్తూ బిపీ, ఎలక్ట్రొలైట్ సమతుల్యత కల్పిస్తూ, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి కూడా సహాయ పడతాయి. మూత్ర పిండాల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రచారం చేయడానికి "ఇంటర్నేషనల్ కిడ్నీ ఫౌండేషన్", "ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్" సంయుక్తంగా 2006 నుంచి ప్రతి సంవత్సరం మార్చి మాసంలో రెండవ గురువారం, అనగా 12 మార్చి 2026 రోజు "ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం" పాటించడం ఆనవాయితీగా మారింది. మూత్ర పిండాల ఆరోగ్య సంరక్షణకు చేపట్టవలసిన జీవనశైలి మార్పులు, తరుచుగా పరీక్షలు, సాధారణ మెలకువలు లాంటి అంశాలను విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతోంది. ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం-2026 ఇతివృత్తంగా "అందరికీ మూత్ర పిండాల ఆరోగ్యం : ప్రజల సంరక్షణ, భూగోళ రక్షణ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. మూత్ర పిండాల ఆరోగ్య సంరక్షణకు నిత్యం తగినంత నీటిని త్రాగడం, సమతుల ఆహారం తీసుకోవడం, రక్తపోటు నియంత్రణ, మధుమేహ అదుపు, క్రమం తప్పకుండా వ్యాయామం, ధూమపానానికి దూరంగా ఉండడం, అతిగా మద్యం సేవించకుండా ఉండడం, మితిమీరిన ఇతర నొప్పి నివారణ మందులు వాడకాన్ని తగ్గించడం, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం, మూత్ర పిండాల పట్ల అవగాహన కలిగి ఉండడం, ఆరోగ్యకరమైన జీవనశైలినా పాటించడం, దురలవాట్లకు దూరంగా ఉండడం లాంటివి పాటించాలి. మూత్ర పిండ సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు అలసట, పాదాల వాపు, చీలమండల వాపు, మూత్ర విసర్జనలో మార్పులు, బలహీనత, ఆకలి మందగించడం, నురగ లేదా రక్తంతో కూడిన మూత్ర విసర్జన, కళ్ళ చుట్టు వాపు, వికారం వంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. మూత్ర పిండాల సమస్య తీవ్రత పెరిగి వైఫల్యానికి లోనయితే డయాలిసిస్, మూత్ర పిండ మార్పిడి కూడా అవసరం అవుతాయి. మధుమేహం, అధిక బిపీ ఉన్న వారు క్రమం తప్పకుండా కిడ్నీల పని తీరు పరీక్షలు చేయించుకోవాలి. జన్యుపరమైన కారణాలు కూడా కిడ్నీ సమస్యలకు రాకుండా కావచ్చని గమనించాలి. గుండె జబ్బులు, స్ట్రోక్ చరిత్ర ఉన్న వ్యక్తులకు మూత్ర పిండ సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ. 60 ఏండ్లు పైబడిన వృద్ధులు, అధిక బరువు, పునరావృత ఇన్ఫెక్షన్లు, మూత్ర పిండాల్లో రాళ్లు ఉన్న వ్యక్తులు, మూత్ర పిండాల ప్రభావంతో దీర్ఘకాలిక మందులు వాడే వ్యక్తులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. మూత్ర పిండాల ఆరోగ్య పరీక్షలకు రక్తం, మూత్రం, ఇమేజింగ్, కిడ్నీ బయాప్సీ, అదనపు పరీక్షలు లాంటివి డాక్టర్లు పర్యవేక్షణలో చేయించుకోవాలి. అన్ని రకాల మూత్ర పిండ సమస్యలను నివారించకపోవచ్చు. కాని బిపీ, షుగర్, బరువు నియంత్రణ, దురలవాట్లకు దూరంగా ఉండడం, నొప్పి నివారణ మందులను తగ్గించడం, క్రమం తప్పకుండా సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవడం, వ్యాయామం చేయడం లాంటి జీవనశైలిని పాటించాలి. ప్రారంభ దశలో నిశ్శబ్దంగా వచ్చే మూత్ర పిండ సమస్యలకు సకాలంలో స్క్రీనింగ్ చేయించుకోవడం ముఖ్యమని తెలుసుకోవాలి. వృద్ధులు, అధిక బిపీ, అధిక షుగర్, తెలివిగా తినడం, గుండె జబ్బులు, జన్యుపరమైన చరిత్ర కలిగిన వ్యక్తులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ మూత్ర పిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. నేటి ఒక చిన్న ప్రయత్నం రేపటి పెద్ద సమస్యను నివారిస్తుందని మరిచిపోరాదు.

### డబ్బులు తీసుకుని నందిగం సురేష్ మోసం

-మొదటిపేజీ తరువాయి

ఇవ్వకపోవడంతో సదరు వ్యక్తి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విజయవాడలోని సూర్యారావుపేట స్టేషన్‌లో బీఎన్ఎస్ఎస్‌లోని 318 (4), 351 (2) సెక్షన్లు నమోదు చేసి.. జీరో ఎఫ్ఐఆర్ కట్టారు. దీనిని గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడ నగరానికి చెందిన షేక్ మౌలాలి బాప్టిజం తీసుకున్నారు. ఆయన కాకినాడ కేంద్రంగా ఉన్న సీబీసీఎన్‌సీ చర్చికి సంబంధించిన ట్రస్టులో సభ్యుడిగా ఉన్నారు. ట్రస్టులో సభ్యుల మధ్య అప్పట్లో విభేదాల కారణంగా దీనిని రెన్యువల్ చేయలేదు. దీంతో మౌలాలి.. కొందరి సూచనలతో అప్పటి బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను కలిశారు. ట్రస్టును రెన్యువల్ చేయిస్తానని సురేష్ హామీ ఇచ్చారు. ఇందుకు రూ.2.50 కోట్లు అవుతుందని చెప్పారు. దీంతో మౌలాలితోపాటు మరికొందరు 2021 నవంబరు 12న.. నందిగం సురేష్‌ను గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలోని ఆయన ఇంట్లో కలసి అడ్వాన్సుగా రూ.25 లక్షలు అందజేశారు. ఆ తర్వాత ఎన్నిసార్లు తిరిగినా పని చేయలేదు. మరో రూ.75 లక్షలు తీసుకురావాలని నందిగం సురేష్ డిమాండ్ చేశారు. దీంతో మౌలాలికి అనుమానం వచ్చి రూ.25 లక్షలు వెనక్కి ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నా నందిగం సురేష్ చెల్లించడం లేదు.

# జంక్ ఫుడ్ చూడగానే నోరూరుతోందా?



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో రుచికరమైన జంక్ ఫుడ్ వైపు మనసు మళ్లడం చాలా సహజం. పిజ్జాలు, బర్గర్లు, సమోసాలు వంటివి చూసినప్పుడు మన మెదడులో కలిగే 'క్రేవింగ్స్' మనల్ని నియంత్రించుకోనివ్వవు. అయితే ఇవి కేవలం తాత్కాలిక రుచిని మాత్రమే ఇచ్చి.. దీర్ఘకాలంలో ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులకు కారణమవుతాయి. జంక్ ఫుడ్ తినాలనే బలమైన కోరికను మొగ్గలోనే తుంచివేసి, ఆరోగ్యకరమైన లైఫ్ స్టైల్ అలవర్చుకోవడానికిగల 7 ప్రభావవంతమైన చిట్కాలేంటో తెలుసుకుందాం. ఆఫీసు నుండి వస్తుంటే రోడ్డు పక్కన వేడివేడి సమోసాల వాసన మిమ్మల్ని లాగుతోందా? లేదా ఇంట్లో కూర్చున్నప్పుడు సడన్ గా పిజ్జా ఆర్డర్ చేయాలనిపిస్తోందా? నిజానికి ఇది మీకు ఆకలి వేయడం వల్ల వచ్చే కోరిక కాదు. మీ మెదడులో జరిగే కొన్ని రసాయన మార్పుల వల్ల కలిగే మాయాజాలం. ఈ క్రేవింగ్స్ లో చిక్కుకుంటే ఆరోగ్యం పాడవ్వడమే కాకుండా జేబు కూడా ఖాళీ అవుతుంది. మరి మనల్ని మనం నియంత్రించుకుంటూ, ఆ జంక్ ఫుడ్ ఆలోచనల నుండి ఎలా బయటపడాలి? మీ లైఫ్ స్టైల్ ను మార్చేసే ఆ 7 అద్భుతమైన చిట్కాలు. చాలా సార్లు మన శరీరం దాహాన్ని ఆకలిగా తప్పుగా అర్థం చేసుకుంటుంది. ఏదైనా జంక్ ఫుడ్ తినాలని అనిపించినప్పుడు వెంటనే ఒక గ్లాసు నీరు తాగండి. ఒక 15 నిమిషాలు ఆగి చూడండి. అప్పుడు ఆ కోరిక ఆటోమేటిక్ గా తగ్గిపోవడాన్ని మీరు గమనిస్తారు. ఆహారంలో ప్రోటీన్ ఎక్కువగా ఉంటే అది మీకు ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని ఇస్తుంది. గుడ్లు, పప్పు ధాన్యాలు, పనీర్ లేదా నట్స్ తీసుకోవడం వల్ల మధ్యలో చిరుతిళ్లు తినాలనే కోరిక కలగదు. నిద్రలేమి వల్ల శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. నిద్ర సరిగ్గా లేనప్పుడు శరీరం శక్తి కోసం చక్కెర, పిండి పదార్థాలు ఎక్కువగా ఉండే జంక్ ఫుడ్ వైపు మొగ్గు చూపుతుంది. రోజుకు 7-8 గంటల గాఢ నిద్ర క్రేవింగ్స్‌ను అదుపులో ఉంచుతుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు శరీరం 'కార్టిసాల్' అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇది మనల్ని తీపి, నూనె పదార్థాలు తినేలా ప్రేరేపిస్తుంది. యోగా, ధ్యానం లేదా నచ్చిన పనిని చేయడం ద్వారా ఈ ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

బరువు తగ్గాలని భోజనం మానేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోయి విపరీతమైన ఆకలి పుడుతుంది. ఫలితంగా కళ్ల ముందు కనిపించిన జంక్ ఫుడ్‌ను ఆపలేనంతగా తినేస్తారు. కాబట్టి క్రమం తప్పకుండా ఆహారం తీసుకోవడం ముఖ్యం. చిప్స్‌కు బదులుగా నట్స్ (జీడిపప్పు, బాదం) లేదా వేయించిన శనగలు తీసుకోండి. తీపి తినాలనిపిస్తే చాక్లెట్లకు బదులుగా పండ్లు లేదా ఖర్జూరాలను ఎంచుకోండి. ఇలా చేయడం వల్ల రుచితో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుంది. వంటగదిలో లేదా ఆఫీసు డెస్క్‌లో జంక్ ఫుడ్ నిల్వ ఉంచకండి. బయటకు వెళ్ళేటప్పుడు ఇంట్లోనే ఏదైనా తిని వెళ్లడం వల్ల బయటి తిండిపై ఆశ కలగదు. షాపింగ్ చేసేటప్పుడు ముందే లిస్ట్ రాసుకుని వెళ్లడం వల్ల అనవసరమైన చిరుతిళ్లు కొనకుండా ఉండవచ్చు.

# రోగనిరోధకత పెంచడంలో దీనికి సాటి లేదు



గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా విస్తారంగా జీడి తోటలు కనిపిస్తుంటాయి. అయితే మన కళ్లు ఎప్పుడూ ఆ చెట్టు చివరన వేలాడే జీడి గింజల (జీడిపప్పు) మీదే ఉంటాయి. కానీ ఆ గింజకు ఆధారమైన రంగురంగుల జీడి పండును మాత్రం మనం పెద్దగా పట్టించుకోము. తోటల్లో రాలిపోయి, నేలపాలయ్యే ఆ పండులో ఎన్ని అద్భుత ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. కేవలం గింజ కోసం పండును పారేయడం ఎంత పెద్ద పొరపాటో తెలుసా? ఆ చెట్టు ఇచ్చే గింజను మనం వేల రూపాయలు పోసి కొంటాం. కానీ అదే చెట్టు ఇచ్చే పండును మాత్రం కనీసం ఉచితంగా ఇచ్చినా తీసుకోము. పల్లెటూళ్లలో వేల టన్నుల కొద్దీ ఈ పండ్లు నేల రాలి కుళ్లిపోతుంటాయి. తీపి, వగరు కలగలిసిన రుచితో ఉండే ఈ పండును కేవలం ఒక వ్యర్థంలా చూడటం మన అవగాహన లోపమే. నిజానికి పోషకాహార నిపుణులు దీనిని ఒక 'సూపర్ ఫుడ్'గా అభివర్ణిస్తున్నారు. మన శరీరానికి కావలసిన విటమిన్లు, ఖనిజాల గనిగా పిలిచే పండే జీడి మామిడి పండు.జీడి పండులో విటమిన్ సి అపారంగా ఉంటుంది. నిమ్మ, నారింజ వంటి పండ్ల కంటే కూడా ఇందులో విటమిన్ సి స్థాయిలు ఎక్కువగా ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచి జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తుంది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఈ పండును తీసుకోవడం వల్ల సీజనల్ వ్యాధుల బారి నుండి తప్పించుకోవచ్చు.నేటి కాలంలో మహిళలు, గర్భిణీలు ఎక్కువగా ఎదుర్కొనే సమస్య రక్తహీనత. జీడి పండులో ఐరన్, కాపర్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి పెరుగుతుంది. సహజ సిద్ధంగా రక్తాన్ని వృద్ధి చేసే గుణం ఈ పండుకు ఉంది. రోజూ ఈ పండును ఆహారంలో భాగంగా తీసుకుంటే రక్తహీనత సమస్య చాలా వరకు తగ్గుముఖం పడుతుంది.జీడి మామిడిలో ఫైబర్ (పీచు పదార్థం) అధికంగా ఉంటుంది. ఇది పొట్ట పనితీరును మెరుగుపరిచి మలబద్ధకం, గ్యాస్, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలను నివారిస్తుంది. తక్కువ క్యాలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక అద్భుతమైన స్నాక్. ఇది తిన్న వెంటనే కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది, తద్వారా అనవసరమైన చిరుతిళ్లపై ఆశ కలగదు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను రక్షించి చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి. ముఖంపై ముడతలు, గీతలు రాకుండా నివారిస్తాయి. అలాగే ఇందులోని పొటాషియం రక్తపోటును నియంత్రించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీడి పండు కొంచెం కషాయం లేదా వగరు రుచిగా అనిపించవచ్చు. కానీ దీనిని శుభ్రంగా కడిగి తీసుకోవడం వల్ల మన శరీరానికి అందే పోషకాలు అమూల్యం. కేవలం జీడిపప్పు కోసమే కాకుండా, ఆరోగ్యం కోసం ఈ అద్భుతమైన పండును కూడా ఆదరించండి. ప్రకృతి ఇచ్చిన ఈ సహజ ఔషధాన్ని ఇకపై నేలపాలు చేయకండి!

# ఆరోగ్యానికి మంచిదే కదా అని తినేస్తున్నారా.!



టమాటాలు నిత్యవసరమైనప్పటికీ, వాటి తొక్కపై పురుగుమందుల అవశేషాలు చేరే ప్రమాదం ఉంది. కేవలం నీటితో కడగడం సరిపోదు. ఉప్పునీటిలో 15-20 నిమిషాలు నానబెట్టి, బాగా రుద్దడం ద్వారా పురుగుల మందుల అవశేషాలను గణనీయంగా తగ్గించవచ్చు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. దాదాపు ప్రతి వంటింట్లోనూ టమాటాలను నిత్యం వాడతారు. అయితే, ఇటీవలి కాలంలో వ్యవసాయంలో పురుగుమందుల వాడకం పెరగడంతో, తొక్కతో తినే టమాటాలను సరిగ్గా శుభ్రం చేయడం అత్యవసరం. కేవలం నీటితో కడగడం వల్ల టమాటా తొక్కపై అంటుకున్న పురుగుమందుల అవశేషాలు పూర్తిగా తొలగిపోవు. టమాటా తొక్క సన్నగా, సున్నితంగా ఉండటం వల్ల రసాయనాలు సులభంగా అంటుకుంటాయి. ఈ రసాయన అవశేషాలను తగ్గించడానికి ఒక పద్ధతి ఉప్పునీటితో శుభ్రం చేయడం. టమాటాలను ఉప్పునీటిలో దాదాపు 15 నుండి 20 నిమిషాలు నానబెట్టాలి. ఉప్పులోని సహజ శుభ్రపరిచే లక్షణాలు పురుగుమందులను వదిలిస్తాయి. అనంతరం, శుభ్రమైన నీటితో కడిగి, చేతులతో సున్నితంగా రుద్దడం వల్ల మట్టి, దుమ్ము, బ్యాక్టీరియా తొలగిపోతాయి. టమాటాలను నిల్వ చేసిన తర్వాత లేదా ఉపయోగించే ముందు తప్పనిసరిగా కడగాలి. అయితే, వండడానికి ముందు టమాటాలను ఎక్కువసేపు నీటిలో నానబెట్టకూడదు, ఎందుకంటే ఇది వాటి ఆకృతిని ప్రభావితం చేయవచ్చు. టమాటాల్లో దెబ్బతిన్న భాగాలను ముందుగానే తొలగించడం మంచిది. ఒకవేళ మీరు పురుగుమందుల అవశేషాల గురించి మరింత ఆందోళన చెందుతుంటే, టమాటా తొక్క తీసి కూడా ఉపయోగించవచ్చు.

ఇది చర్మం నుండి ఉపరితల పురుగుమందుల అవశేషాలను చాలా వరకు తొలగించడానికి సహాయపడుతుంది. స్థానికంగా పండించిన టమాటాలు కొనుగోలు చేయడం ద్వారా పురుగుమందులకు గురయ్యే అవకాశాన్ని తగ్గించుకోవచ్చు. ఉప్పునీటి పద్ధతి ఉపరితల పురుగుమందులను మాత్రమే తగ్గిస్తుందని గుర్తుంచుకోవాలి. టమాటాలను పండించే సమయంలో వాటిలోకి చొప్పించిన (సిస్టమిక్) రసాయనాలను ఈ పద్ధతి పూర్తిగా తొలగించదు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో భాగంగా, వంటింట్లో ఇలాంటి చిన్న చిన్న శుభ్రపరిచే చర్యలు మీ కుటుంబ ఆరోగ్యంపై పెద్ద ప్రయోజనాలను కలిగిస్తాయి. టమాటా తొక్కలను ఉప్పుతో సరిగ్గా శుభ్రం చేయడం పురుగుమందుల అవశేషాలను తగ్గించడానికి ఒక సులభమైన, ప్రభావవంతమైన పద్ధతి.

# వన్డే వరల్డ్ కప్.. ఇక అడుగులన్నీ అటువైపే

**2007లో తొలి టీ20 ప్రపంచకప్‌ను గెలిచాక ఇంకో టైటిల్ సాధించడానికి టీమ్‌ఇండియాకు 17 ఏళ్లు పట్టింది. కానీ 2024లో ట్రోఫీ గెలిచాక.. ఇంకో 20 నెలలకే మరో పొట్టి కప్పును సొంతం చేసుకుంది భారత జట్టు. ఈ గెలుపు అభిమానులను అమితానందానికి గురి చేసింది. మరి తర్వాతేంటి అన్న ప్రశ్న తలెత్తడం సహజం. ఇక రానున్నది వన్డే ప్రపంచకప్. 2027లో ఆ ట్రోఫీని సాధించడానికి ఇప్పట్నుంచే సన్నాహాలు మొదలుపెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది.**



టీ20ల ప్రభావం వల్ల గత కొన్నేళ్లలో వన్డేలకు ఆదరణ తగ్గి ఉండొచ్చు. ఆ మ్యాచ్‌ల సంఖ్యా గణనీయంగా తగ్గి ఉండొచ్చు. కానీ.. ఇప్పటికీ వన్డే ప్రపంచకప్పే క్రికెట్లో అత్యున్నత టోర్నీ అనడంలో సందేహం లేదు. రెండేళ్లకోసారి వచ్చే పొట్టి కప్పు కంటే నాలుగేళ్లకు ఒకసారి ఆడే వన్డే ప్రపంచకప్‌నే క్రికెటర్లు కూడా గొప్పగా భావిస్తారు. ఆ ప్రతిష్ఠాత్మక టోర్నీలో భారత్ రెండుసార్లు విజేతగా నిలిచింది. 1983లో కపిల్ డెవిల్స్ తొలి కప్పును అందుకుంటే.. 2011లో ధోనీసేన ఛాంపియన్‌గా నిలిచింది. తర్వాతి మూడు టోర్నీల్లోనూ భారత్‌కు నిరాశ తప్పలేదు. 2023లో గొప్ప ప్రదర్శన చేసినప్పటికీ.. కప్పు అందినట్లే అంది చేజారింది. ఇక దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఉమ్మడిగా ఆతిథ్యమిచ్చే తర్వాతి కప్పులో గెలిచి తీరాలని భారత్ పట్టుదలతో ఉంది. 20 నెలల వ్యవధిలో రెండు టీ20 ప్రపంచకప్‌లు గెలిచి పరిమిత ఓవర్ల క్రికెట్లో తన ఆధిపత్యాన్ని చాటింది టీమ్‌ఇండియా. ఇదే ఊపులో వన్డే కప్పును కూడా సొంతం చేసుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే ముందు నుంచే పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తేనే అది సాధ్యమవుతుంది.టీ20 ప్రపంచకప్ కోసం కోచ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ కలిసి ఇదే చేశారు. చాలా ముందుగానే జట్టుపై ఒక అంచనాకు వచ్చారు. ఎక్కువగా కుర్రాళ్లకు పెద్ద పీట వేసి వారికి విరివిగా అవకాశాలు ఇచ్చారు. దీంతో అభిషేక్ శర్మ, తిలక్ వర్మ లాంటి కుర్రాళ్లు జట్టులో కీలక ఆటగాళ్లుగా ఎదిగారు. టోర్నీకి దగ్గర్లో జట్టు అవసరానికి తగ్గట్లు కొన్ని మార్పులు చేర్పులు చేశారు. శుభ్‌మన్ గిల్‌కు అవకాశమిచ్చి చూస్తే అతను ఉపయోగించుకోలేకపోయాడు. వన్డేలు, టెస్టుల్లో కెప్టెన్ అయినప్పటికీ.. ప్రదర్శన సరిగా లేని అతడిపై వేటు వేయడానికి వెనుకంజ వేయలేదు. జితేశ్ శర్మను తప్పించి టాప్ ఆర్డర్ అవసరాలకు తగ్గట్లు ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేయడం కూడా వ్యూహాత్మక నిర్ణయం. ఇవన్నీ బాగా పని చేశాయి. ఇప్పుడు వన్డే ప్రపంచకప్ కోసం కూడా ఇలాగే వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. జట్టు కోసం అవసరమైతే కఠిన నిర్ణయాలూ తీసుకోవాలి. చాలా ముందే జట్టుపై ఒక అంచనాకు రావడం, ప్రపంచకప్ కోసం ఆటగాళ్లతో ఒక పూల్‌ను సిద్ధం చేయడం అవసరం. వచ్చే ఏడాదిన్నరలో టీమ్‌ఇండియా వీలైనన్ని ఎక్కువ వన్డే సిరీస్‌లు ఆడడం.. ప్రపంచకప్ వేదిక అయిన ఆఫ్రికాలో పర్యటించడం మీద బీసీసీఐ దృష్టి సారిస్తుందనడంలో సందేహం లేదు. వచ్చే రెండు నెలలు ఐపీఎల్ సందడి ఉంటుంది. ఈలోపు కోచ్ గంభీర్ తన బృందంతో కలిసి వన్డే ప్రపంచకప్ కోసం ప్రణాళికలు రచిస్తే.. జూన్ నుంచి వాటిని అమల్లో పెట్టడమే తరువాయి.బంతి బలం పెరగాలి: భారత్‌కు బ్యాటింగ్‌లో ఎప్పుడూ తిరుగులేదు. ఇటీవల టీ20 ప్రపంచకప్‌లోనూ అంతే. కానీ ఈ టోర్నీలో కూడా బౌలింగ్ పరంగా తడబాటు తప్పలేదు. కొన్నేళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉంది. సరైన ప్రత్యామ్నాయాలు లేకపోయినప్పటికీ.. షమిని సెలక్టర్లు పూర్తిగా పక్కన పెట్టేశారు. సిరాజ్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ లాంటి బౌలర్లు అంతగా భరోసానివ్వలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో షమిని మళ్లీ జట్టులోకి ఎంపిక చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అతను ఏడాదిగా దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్నాడు. వచ్చే ప్రపంచకప్ వరకు ఫిట్‌నెస్‌ను కాపాడుకునే స్థితిలో ఉంటే షమికి ఇంకో అవకాశం ఇవ్వడంలో తప్పు లేదు. రంజీ ట్రోఫీలో అదరగొట్టిన ఆకిబ్ నబి సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఐపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్‌కు ఆడబోతున్న అతను.. టోర్నీపై తనదైన ముద్ర వేయగలిగితే.. ప్రపంచకప్ కోసం అతణ్ని సిద్ధం చేయొచ్చు. ఇంకా కొన్ని పేస్ బౌలింగ్ ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. స్పిన్‌లోనూ టీమ్‌ఇండియా ఒకప్పటంత బలంగా కనిపించడం లేదు. వరుణ్ చక్రవర్తి ప్రభావం తగ్గింది. కుల్‌దీప్‌కు మరిన్ని అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం కనిపిస్తోంది. రవి బిష్ణోయ్‌పైనా దృష్టిసారించాల్సి ఉంది.

# పాక్‌ను చిత్తుగా ఓడించిన బంగ్లాదేశ్

- తొలి వన్డేలో పాక్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసి బంగ్లా
- ఐదు వికెట్లతో పాక్‌ను దెబ్బతీసిన బంగ్లా పేసర్ నహిద్ రాణా
- దూకుడైన హాఫ్ సెంచరీతో చెలరేగిన తన్జిమ్ హసన్ తమీమ్
- ఇంకా 209 బంతులు మిగిలి ఉండగానే గెలిచిన బంగ్లాదేశ్




ఢాకా వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్ ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. పాక్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసి సిరీస్‌లో శుభారంభం చేసింది. బౌలింగ్‌లో యువ పేసర్ నహిద్ రాణా, బ్యాటింగ్‌లో ఓపెనర్ తన్జిమ్ హసన్ తమీమ్ అద్భుతంగా రాణించి బంగ్లాకు సునాయాస విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై నహిద్ రాణా తన పేస్‌తో పాక్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఐదు వికెట్ల ప్రదర్శనతో పాక్ పతనాన్ని శాసించాడు. దీంతో పాకిస్థాన్ జట్టు కేవలం 30.4 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. అనంతరం 115 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ ఓపెనర్ తన్జిమ్ హసన్ తమీమ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. పాక్ బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 42 బంతుల్లోనే 67 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. దీంతో బంగ్లాదేశ్ ఇంకా 209 బంతులు మిగిలి ఉండగానే కేవలం రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. పాకిస్థాన్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది, మహమ్మద్ వసీమ్ చెరో వికెట్ పడగొట్టారు.

## సీజన్ మొత్తం ఆడతాడు.. ధోనీ పాత్ర గురించి మాట్లాడలేను: సీఎస్‌కే సీఈవో



మరికొద్దిరోజుల్లో ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం కానుంది. టీ20 ప్రపంచ కప్‌లో ఆడిన ప్లేయర్లంతా ఓ వారం రోజుల వరకూ విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత ఐపీఎల్ కోసం సన్నద్ధమవుతారు. మిగతా ఆటగాళ్లంతా ఇప్పటికే సన్నద్ధతను మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. టీమ్‌ఇండియా మాజీ సారథి, చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన ఎంఎస్ ధోనీపైనే ఈసారి కూడా అందరి దృష్టి ఉంది. బరిలోకి దిగుతాడని ఇప్పటికే సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథ్ తెలిపారు. అయినా సరే, అన్ని మ్యాచులు ఆడతాడా? 20 ఓవర్లపాటు మైదానంలో ఉంటాడా? అనే ప్రశ్నలు అభిమానుల మదిలో మెదిలాయి. దీనిపై తాజాగా సీఈవో విశ్వనాథ్ స్పందించారు.

**రిపోర్టర్: ధోనీని సీజన్ మొత్తం మైదానంలో చూడొచ్చా?**

**కాశీ విశ్వనాథ్:** ఎంఎస్ ధోనీ ఈసారి సీజన్‌లోనూ ఆడతాడు. అన్ని మ్యాచుల్లోనూ బరిలోకి దిగుతాడు.

**రిపోర్టర్:** ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా వినియోగిస్తారా?

**కాశీ విశ్వనాథ్:** ఆ ప్రశ్న గురించి నేనేం మాట్లాడలేను. అది క్రికెట్‌కు సంబంధించిన నిర్ణయం. స్టాఫ్ నిర్ణయం తీసుకుంటారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ తీసుకొనేది కాదు. బ్యాటర్‌గా ఆడతాడా? వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గానా? ఇంపాక్ట్ ప్లేయర్‌గానా అనేది వారు డిసైడ్ చేస్తారు.

**ఆ ఇద్దరు అదరగొట్టారు**

"టీమ్‌ఇండియా వరుసగా రెండు టీ20 ప్రపంచ కప్‌లను నెగ్గడం సంతోషంగా ఉంది. అందులో సీఎస్‌కే ప్లేయర్లు సంజు శాంసన్, శివమ్ దూబే అద్భుతంగా ఆడారు. వారి స్ఫూర్తితో ఐపీఎల్‌లో సీఎస్‌కే ఆటగాళ్లు ఉత్తమ ప్రదర్శన చేస్తారని భావిస్తున్నా. ఇక మా మ్యాచులన్నింటినీ చెన్నై వేదికగా ఆడతాం. తమిళనాడు ఎన్నికల నేపథ్యంలో.. ఆటగాళ్ల ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. పూర్తి స్థాయి షెడ్యూల్ కోసం మేమూ వేచి చూస్తున్నాం" అని సీఈవో తెలిపారు.

# యంగ్ డైరెక్టర్..ఇది కదా జర్నీ అంటే!



సినిమా ఇండస్ట్రీలో ఎవరి లైఫ్ ఎలా టర్న్ అవుతుందో ఎవరూ చెప్పలేరు.. రాత్రికి రాత్రే జీవితాలు తారుమారయ్యే రంగం ఏదైనా ఉందంటే అది సినిమా రంగమే. ఇక్కడ రాత్రికి రాత్రే అద్భుతాలు చేసిన వారున్నారు. అలాగే కనుమరుగైన వారు కూడా ఉన్నారు. అయితే టాలెంట్ ఉంటే వారి లైఫ్ ఎప్పటికైనా ఊహించని స్థాయికి వెళుతుందన్నది అందరికి తెలిసిందే. సినిమా ఇండస్ట్రీలో టాలెంట్, అదృష్టం రెండూ ఉంటే వారి లైఫ్ ఊహించని స్థాయికి చేరుకుంటుందన్నది చాలా మంది విషయాల్లో నిజమైంది.యంగ్ డైరెక్టర్ టర్న్డ్ క్రేజీ హీరో ప్రదీప్ రంగనాథన్ విషయంలో ఇప్పుడు అక్షరాలా ఇదే జరిగి అందరిని ఆశ్చర్యపరుస్తోంది. ఏడేళ్ల జర్నీలో ప్రదీప్ అద్భుతాలు చేసి చూపించాడు. ఊహించని స్థాయికి చేరుకున్నాడు. వివరాల్లోకి వెళితే...కోలీవుడ్ యంగ్ క్రేజీ డైరెక్టర్ కమ్ హీరోల్లో ఇప్పుడు రైజింగ్‌లో ఉన్న స్టార్ ప్రదీప్ రంగనాథన్. చెన్నైలోని ఓ సాధారణ మధ్యతరగతి ఫ్యామిలీకి చెందిన ప్రదీప్ ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఆయన తండ్రి రన్ చేస్తున్న జిరాక్స్ షాప్‌ని నడుపుతూ స్నేహితుల సహాయంలో షార్ట్ ఫిలింస్ చేస్తుండేవాడు.వాట్సప్ కాదల్, యాప్ లాక్ షార్ట్ ఫిలింస్‌తో పాపులర్ అయిన ప్రదీప్ రంగనాథన్ 2019లో రవిమోహన్ (జయం రవి), కాజల్ అగర్వాల్ జంటగా 'కోమాలి' సినిమా చేశాడు. ఇది అతని ఫస్ట్ డైరెక్టోరియల్ మూవీ. దీనికి రైటర్‌గా, డైరెక్టర్‌గా తను అందుకున్న పరితోషికం అక్షరాలా రూ.50 లక్షలు మాత్రమే. తను రూపొందించిన –యాప్ లాక్– షార్ట్ ఫిల్మ్ స్టోరీనే 'లవ్ టుడే'గా చేసి బ్లాక్ బస్టర్ హిట్‌ని డైరెక్టర్‌గా, హీరోగా అందుకుని అందరిని ఆశ్చర్యపరిచాడు. ఈ సినిమా రిలీజ్‌కు ముందు తనకు దక్కిన పారితోషికం రూ.70 లక్షల నుంచి 80 మధ్యలో..అయితే సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ వారు ప్రదీప్‌కు మరింత మొత్తాన్ని అందించడంతో ఈ మూవీకి తను అందుకున్న పారితోషికం రూ.1.50 కోట్లు చేరింది. ఇక అశ్వత్ మారిముత్తు డైరెక్ట్ చేసిన 'డ్రాగన్' మూవీకి కథ అందించి హీరోగా నటించినందుకు గానూ ప్రదీప్‌కు రూ.10 కోట్ల వరకు పారితోషికం అందింది. ఇక తెలుగు, తమిళ భాషల్లో చేసిన 'డ్యూడ్' మూవీకి రూ.12 కోట్లు పారితోషికం అందుకున్నాడు. తను హీరోగా నటించిన మూడు సినిమాల్లో 'లవ్ టుడే' రూ.105 కోట్లు రాబట్టగా, డ్రాగన్ రూ.150 కోట్లు వసూలు చేసింది.ఇక తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన 'డ్యూడ్' మూవీ రూ.100 కోట్లకు పైనే రాబట్టింది. ప్రస్తుతం ప్రదీప్ రంగనాథన్ లేడీ సూపర్ స్టార్ నయనతార భర్త విఘ్నేష్ శివన్ రూపొందిస్తున్న 'లవ్ ఇన్సురెన్స్ కంపనీ'లో నటిస్తున్నాడు. కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో ఎస్.జె.సూర్య, మిస్కిన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. షూటింగ్ పూర్తయింది. ప్రదీప్ కెరీర్‌లోనే భారీ బడ్జెట్ మూవీ ఇది. త్వరలోనే రిలీజ్ కానుంది. ప్రస్తుతం ప్రదీప్ రంగనాథన్ కోసం టాలీవుడ్, కోలీవుడ్‌కు చెందిన ప్రముఖ ప్రొడక్షన్ కంపనీలు క్యూ కడుతున్నాయి. ఒక్కో ప్రాజెక్ట్‌కు రూ.25 కోట్ల మేరకు పారితోషికం ఇవ్వడానికి రెడీగా ఉన్నాయి. రూ.50 లక్షల పారితోషికం నుంచి ఏడేళ్ల జర్నీలో రూ.25 కోట్లకు ప్రదీప్ రంగనాథన్ ఎదిగిన తీరు ఎంతో మంది కొత్త వారికి స్ఫూర్తిగా నిలుస్తూ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.



ఐశ్వర్య మీనన్ యొక్క బ్రీజీ సీసైడ్ అవుట్‌ఫిట్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com